

నకిలీ డీలర్ల అడ్డగోలు వ్యవహారం

- పౌరసరఫరాల శాఖలో మరో దందా
- ప్లాస్టిక్ వేలిముద్రతో ఆన్‌లైన్‌లో లాగిన్
- గోదాము నుంచి సరుకు విడిపించినప్పటి నుంచి ఎండీయూకు అప్పగించే వరకు అదే తీరు
- ఐరిస్ విధానం అమలుచేస్తేనే కట్టడి

-8లో



పూర్ణామార్కెట్‌లో మళ్లీ ఆశీలు దందా

ఇటీవల వేలం నిర్వహణ

ఇంకా స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించకుండానే కలెక్షన్‌కు కొత్త కాంట్రాక్టర్ శ్రీకారం

- జీవీఎంసీ పేరుతో వసూళ్లు
- రోడ్డుపై గతంలో తొలగించిన జంగిడీలను తిరిగి ఏర్పాటుచేసుకునేలా ప్రోత్సాహం
- ఒక్కో వ్యాపారి నుంచి రూ.300 వసూలు
- పార్కింగ్ ఫీజు రెట్టింపు వసూలు
- చోద్యంచూస్తున్న పోలీసులు, జీవీఎంసీ అధికారులు



పూర్ణామార్కెట్ బయట జంగిడీలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందా మళ్లీ మొదలైంది. ఇటీవల అధికారులు నిర్వహించిన వేలంలో ఒకరు రూ.81 లక్షలకు ఆశీలు వసూలు కాంట్రాక్టు దక్కించుకున్నారు. అయితే ఇంకా స్టాండింగ్ కమిటీ ఆమోదించాల్సి ఉంది. అప్పటి వరకూ జీవీఎంసీ డిపార్టుమెంట్ ఆశీలు వసూలు చేయాల్సి ఉండగా, ఆ పేరుతో కొత్త కాంట్రాక్టరే కలెక్షన్ మొదలెట్టేశారు. గతంలో మాదిరిగా రోడ్డుపై జంగిడీలు కూడా పెట్టించారు. పార్కింగ్ ఫీజులు కూడా గెజిట్‌కంటే రెట్టింపు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులుగానీ, పోలీస్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పూర్ణామార్కెట్‌లోని దుకాణాల నుంచి ఆశీలు, అక్కడ పార్కింగ్ ఫీజు వసూలు కోసం జీవీఎంసీ జోన్-4 అధికారులు ఏటా వేలం నిర్వహిస్తుంటారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ గెజిట్‌లో పేర్కొన్న ధరల ప్రకారం ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేలా ఇటీవల అధికారులు వేలం నిర్వహించారు. రూ.81 లక్షలకు ఒకరు కాంట్రాక్టు దక్కించుకున్నారు. వేలం పాటకు సంబంధించిన ఫైల్‌ను జోన్-4 రెవెన్యూ అధికారులు స్టాండింగ్ కమిటీకి పంపిస్తే, చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ వేలం పాట నిర్వహణలో లోపాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నా, ఆశించిన ధర కంటే తక్కువ వచ్చినట్టు సభ్యులు భావించినా తిరిగి వేలం నిర్వహించాలని ఆదేశించవచ్చు. అంతా సక్రమంగానే జరిగిందని భావిస్తే వేలం పాటను ఆమోదించవచ్చు. స్టాండింగ్ కమిటీ ఆమోదిస్తే జోన్-4 రెవెన్యూ అధికారులు వేలంపాటలో కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తికి వర్క్ ఆర్డర్ ఇస్తారు. వర్క్ ఆర్డర్ అందుకున్న తర్వాతే కాంట్రాక్టర్ ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు వీలుంటుంది. వర్క్ ఆర్డర్ ఇవ్వడంలో జాప్యం జరిగితే ఆ మేరకు వేలం మొత్తంలో (ఏప్రిల్ 1 నుంచి లెక్కలోకి తీసుకుంటారు) కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ మినహాయింపు ఇస్తుంది. అయితే ఇటీవల కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి ఇంకా స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించకుండానే మంగళవారం నుంచి ఆశీలు, పార్కింగ్ ఫీజు వసూలు ప్రారంభించేశారు. పైగా గతంలో తొలగించిన జంగిడీలను తిరిగి రోడ్డుపై పెట్టుకోవాలంటూ వ్యాపారులను ప్రోత్సహిస్తున్నారు. వారి వద్ద నుంచి రూ.300 చొప్పున ఆశీలు వసూలు చేస్తున్నారంటూ పలువురు జీవీఎంసీ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. అలాగే కారుకు రూ.పది, బైక్‌కు రూ.ఐదు చొప్పున పార్కింగ్‌ఫీజు వసూలు చేయాలని బోర్డులు ఏర్పాటుచేసినప్పటికీ కారుకు రూ.20, బైక్‌కు రూ.పది చొప్పున వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే జీవీఎంసీ డిపార్టుమెంట్ తరపున కలెక్షన్ చేస్తున్నామని, తమకు ఇంకా వర్కు ఆర్డరు ఇవ్వలేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. ఈ విషయమై ఆధారాలతో సహా ఒకరు మంగళవారం జీవీఎంసీ జోన్-4 అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేయాలని నిర్ణయించారు. రోడ్డుపై జంగిడీలు, తోపుడుబండ్లు పెట్టడం వల్ల ట్రాఫిక్‌జామ్ అవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని కొనుగోలుదారులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు వద్ద ప్రస్తావించగా, స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండా కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేయడానికి వీల్లేదన్నారు. రోడ్డుపై జంగిడీలు పెట్టించినట్టు, మంగళవారం నుంచే ఆశీలు వసూలుచేస్తున్నట్టు, రెట్టింపు పార్కింగ్ ఫీజు వసూలుచేస్తున్నట్టు తన దృష్టికి రాలేదన్నారు. బుధవారం తానే స్వయంగా మార్కెట్‌కు వెళ్లి పరిస్థితి గతంలో మాదిరిగా ఉండేలా చర్యలు తీసుకుంటానన్నారు.



పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వ్యక్తి

గాడి తప్పుతున్న గ్రేటర్

రెండు నెలల నుంచి ఖాళీగా కమిషనర్ కుర్చీ

- అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన నేపథ్యంలో క్యాంపు రాజకీయాల్లో మేయర్ బిజీ
- నిలిచిపోయిన క్షేత్రస్థాయి తనిఖీలు
- జీవీఎంసీలో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- అధికారులు, సిబ్బందిలో అలసత్వం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపుపొందిన జీవీఎంసీని ముందుండి నడిపించాల్సిన కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. గత కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసి రెండు నెలలు గడిచినప్పటికీ ఇంతవరకూ కొత్తవారిని నియమించలేదు. మరోవైపు కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో మేయర్ కూడా నగర పాలక సంస్థ కార్యాలయానికి రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రశ్నించేవారు లేక జీవీఎంసీలో అలసత్వం పెరిగిపోయింది.

దాదాపు 681 చదరపు కిలోమీటర్ల వైశాల్యం, 22 లక్షల జనాభాతో రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీకి గుర్తింపు ఉంది. స్మార్ట్ సిటీగా జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించింది. కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు దక్కించుకుంటోంది. అంతటి కీలకమైన జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించడంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడం నగరాభివృద్ధికి అవరోధంగా మారడంతోపాటు పారిశుధ్యం దిగజారేలా చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాడితప్పిన పాలన

జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన పి.సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 21న అకస్మాత్తుగా బదిలీ చేసింది. అయితే ఆయన స్థానంలో ఎవరినీ నియమించకుండా, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. కమిషనర్‌ను బదిలీ చేసిన వారం రోజుల్లోపే కొత్త కమిషనర్‌ను నియమిస్తారని భావించారు. దీంతో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా కలెక్టర్ కూడా జీవీఎంసీపై శ్రద్ధ చూపలేదు. అయితే నెలలు గడుస్తున్నా కమిషనర్ నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో జీవీఎంసీ బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. చివరకు ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బడ్జెట్‌ను ఆమోదించకపోతే జీవీఎంసీ సాధారణ కార్యకలాపాలు నిర్వహించడానికి కూడా ఇబ్బందులు తప్పవని అధికారులు హెచ్చరించడంతో నాలుగు రోజుల క్రితం ఆదరాబాదరాగా బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేశారు.

దృష్టి సారించని కలెక్టర్

కాగా కమిషనర్ పోస్టు రెండు నెలలకు పైగా ఖాళీగా ఉండిపోవడంతో నగరంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిలిచిపోయాయి. ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కలెక్టర్ తన విధుల్లో బిజీగా ఉండడంతో జీవీఎంసీ కార్యకలాపాలపై దృష్టిపెట్టేందుకు అవకాశం ఉండడం లేదు. మరోవైపు ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు నిలిచిపోవడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. కమిషనర్ లేకపోవడంతో ప్రజారోగ్య విభాగంలోని అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మొక్కుబడిగా విధులకు హాజరై వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తుండడం దీనికి బలాన్ని చేకూర్చుతోంది.

కమిషనర్ లేకపోతే అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా యంత్రాంగాన్ని నడిపించాల్సిన మేయర్ గొలగాని వెంకటకుమారి కూడా అవిశ్వాస తీర్మానం నోటీస్ నేపథ్యంలో అసలేమీ పట్టించుకోవడం లేదు. తమ పార్టీ కార్పొరేటర్లను తీసుకుని బెంగళూరు వెళ్లిపోయారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశానికి తప్పనిసరి పరిస్థితిలో వచ్చినప్పటికీ రెండు రోజులకే తిరిగి బెంగళూరు వెళ్లారు. దీనివల్ల అధికారులను ప్రశ్నించేనాథుడే లేకుండాపోయారు. ప్రస్తుతం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫైళ్లపై సంతకాలు చేసేవారుకానీ, విధానపరమైన నిర్ణయాలను తీసుకునేవారు కానీ లేకపోవడంతో అధికారుల్లో నిస్తేజం అలముకుంది.

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

- మే నెలాఖరు వరకూ బెర్తు లభించే పరిస్థితి లేదు
- డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలులో మాత్రమే ఖాళీలు



విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

వేసవి సీజన్‌లో తిరుపతి, షిర్డీ రైళ్లలో బెర్తులు లభించడం గగనంగా మారింది. ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని 120 నుంచి 60 రోజులకు కుదించిన నేపథ్యంలో మరింత డిమాండ్ పెరిగింది. ప్రతి గురువారం విశాఖ నుంచి సికింద్రాబాద్ మీదుగా షిర్డీ వెళ్లే షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), అలాగే ప్రతి ఆదివారం విశాఖ నుంచి రాయగడ మీదుగా మన్మాడ్ జంక్షన్‌కు నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. అదేవిధంగా తిరుపతి వెళ్లేందుకు ఉన్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521), హౌరా-బెంగళూరు (12863), పూరి-తిరుపతి, బిలాస్‌పూర్-తిరుపతి, వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) వంటి రోజువారీ రైళ్లతోపాటు వారాంతపు, బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏడాది పొడవునా డిమాండ్ ఉండడంతో ప్రయాణికులు ఆశించిన తేదీల్లో బెర్తులు పొందలేని పరిస్థితులు నెలకొన్నాయి.

తిరుపతికి విశాఖ నుంచి బయలుదేరే ఒరిజినేటింగ్ రైళ్లు కేవలం రెండు (తిరుమల, డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లు) మాత్రమే. మిగిలినవన్నీ ఇతర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా నడిచేవి. దీంతో విశాఖ నుంచి తిరుపతి బయలుదేరే తిరుమల

... మిగతా 6వ పేజీలో

రోడ్డునపడ్డ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్టింగ్ షాప్, రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, వైర్ రాడ్ మిల్స్, విభాగాల్లో 1,503 మంది తొలగింపు

- సోమవారం అర్ధరాత్రి తరువాత విభాగాలకు జాబితాలు
- సిబ్బందిని తగ్గించడంపైనే యాజమాన్యం దృష్టి
- నేడు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్న సంఘ నాయకులు



ధర్నా చేస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం/ఉక్కునగరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

స్టీల్ ప్లాంటు యాజమాన్యం ప్రధానంగా సిబ్బందిని తగ్గించడంపైనే దృష్టి కేంద్రీకరించింది. మూడు రోజుల క్రితం 248 మంది కాంట్రాక్టు కార్మికుల పాస్‌లు రద్దు చేసిన యాజమాన్యం తాజాగా 1,503 మందిని తొలగిస్తున్నట్టు ఆయా విభాగాలకు తెలియజేసింది.

ప్లాంటులో సపోర్టింగ్ సిబ్బంది పేరుతో కాంట్రాక్టు కార్మికులను తీసుకోవడం ఎప్పటి నుంచో ఉంది. అయితే వారి సంఖ్యను 3,500 తగ్గించాలని ప్రస్తుతం సీఎండీ లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా ఇటీవల 700 మంది పాస్‌లు రెన్యువల్ చేయలేదు. ఇలా వివిధ కారణాలతో సుమారుగా వేయి మందిని ప్లాంటుకు రాకుండా చేశారు. ఇప్పుడు బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్టింగ్ షాప్, రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు, వైర్ రాడ్ మిల్స్, జనరల్ అడ్మిన్ విభాగాల నుంచి మరో 1,503 మందిని తొలగించారు. సోమవారం అర్ధరాత్రి తరువాత తొలగించిన కాంట్రాక్టు కార్మికుల జాబితాను ఆయా కాంట్రాక్టర్లకు యాజమాన్యం పంపించింది. అంటే ఏ విభాగంలో కూడా అధికారులకు సహాయక సిబ్బంది లేకుండా చేస్తున్నారు. ఇంకో వేయి మందిని తగ్గించాలనే ఆలోచనలో ఉన్నారు. యాజమాన్యం చర్యలను నిరసిస్తూ ఇటీవల కార్మికులు ఒక రోజు సమ్మె చేసినా ఫలితం లేకుండా పోయింది. కాగా కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

సీఐఎస్ఎఫ్‌ను తగ్గించి ఏపీఎస్‌పీఎఫ్‌కు బాధ్యతలు

స్టీల్ ప్లాంటు రక్షణలో కీలకంగా వ్యవహరించే సీఐఎస్ఎఫ్‌ను ఇటీవల నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని 450 మందిని

... మిగతా 6వ పేజీలో

వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు

- 'పతంజలి' ప్రతినిధులు పలు ప్రాంతాలు చూసి వెళ్లారు
- మేర్లిన్ కే, శాంక్టన్‌కు నోటీసులు ఇచ్చాం
- పర్యాటక ప్రాజెక్టులకు సింగిల్ విండో అనుమతులు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా పర్యాటక శాఖాధికారి సుధా సాగర్



డీటీఓ సుధా సాగర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో వెల్‌నెస్ సెంటర్లకు మంచి డిమాండ్ ఉందని, చాలామంది అనువైన భూములు కావాలంటూ పర్యాటక శాఖను సంప్రతిస్తున్నారని జిల్లా పర్యాటక శాఖాధికారి (డీటీఓ) సుధాసాగర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో పనిచేస్తున్న ఆయన ఇటీవల డీటీఓగా బాధ్యతలు చేపట్టారు.

ప్రశ్న: వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న సంస్థలేవి?

జవాబు: పతంజలి గ్రూపునకు చెందిన ప్రతినిధులు ఇటీవల పలు ప్రాంతాలను చూసి వెళ్లారు. ఇంకా చాలామంది ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం కూడా మంచి వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసే యోచనలో ఉంది.

ప్ర: పర్యాటక శాఖ బీచ్ రెస్టారెంట్లను అద్దెకు ఇస్తే వారు పక్కన భూములు ఆక్రమించడంపై తీసుకున్న చర్యలు?

జ: తొట్లకొండలో శాంక్టన్‌కు, భీమిలిలో మేర్లిన్ కే‌కు అదనపు నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరిస్తూ నోటీసులిచ్చాం.

ప్ర: అన్నవరంలో ఒబెరాయ్, మే ఫెయిర్ ప్రాజెక్టుల పరిస్థితి?

జ: ఒబెరాయ్ గ్రూపు ఎర్త్ వర్క్ ప్రారంభించింది. మే ఫెయిర్ భూములకు ప్రధాన మార్గం నుంచి యాక్సెస్

... మిగతా 6వ పేజీలో

అవినీతి జబ్బుకు ట్రీట్‌మెంట్

కేజీహెచ్‌లో మార్చురీ వద్ద వసూళ్లకు ఫోరెన్సిక్ విభాగాధిపతి చెక్

- ఎవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదంటూ బోర్డుల ఏర్పాటు
- ఫిర్యాదు బాక్సులు కూడా...
- అవసరమైన సామగ్రిని నేరుగా అందజేస్తున్న డాక్టర్ మమత
- గతంలో కనీసం రూ.5 వేల నుంచి పది వేల రూపాయల వరకూ వసూలు



మార్చురీ



మార్చురీ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



ప్రొఫెసర్ కె.మమత

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్‌లో కొన్నిచోట్ల డబ్బులు ఇవ్వనిదే పని జరగదు. ఇది బహిరంగ రహస్యం. అటువంటి వాటిలో మార్చురీ ఒకటి. పోస్టుమార్టం నిర్వహించేందుకు అక్కడ అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తుంటారు. పోస్టుమార్టం ప్రక్రియను నిర్వహించే ఫోరెన్సిక్ విభాగానికి చెందిన కొందరు వైద్యులు, మార్చురీలో పని చేసే కిందిస్థాయి సిబ్బంది కలిసి ఒక రేటు ఫిక్స్ చేశారు. పోస్టుమార్టం నిర్వహించడానికి, కవర్లు, ఇతర సామగ్రి అందించేందుకు కనీసం రూ.5 వేల నుంచి పది వేల రూపాయల వరకు తీసుకుంటుంటారు. ఈ దందా అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. అయితే, అనధికారికంగా సాగుతున్న ఈ వసూళ్లకు చెక్ చెప్పేందుకు ఫోరెన్సిక్ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కె.మమత యత్నిస్తున్నారు.

పోస్టుమార్టం నిర్వహించేందుకు ఎవరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదంటూ కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఫోరెన్సిక్ విభాగాధిపతి ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను ఆమె ఏర్పాటుచేయించారు. అలాగే, ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం నిర్వహించడానికి ముందు పోలీసులు కొన్ని పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఆ

... మిగతా 6వ పేజీలో

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9985411659

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

టీడీపీ నాయకుల సమావేశం

తగరపువలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో మండల టీడీపీ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సాధికారిక సారధుల ఎంపికపై చర్చించారు. ఈ కమిటీలో అన్ని పార్టీల కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నరసింగరావు, చోడిపల్లి జయశంకర్, నానాజీ, పైడిరాజు, కిల్లి కుమార్, గులిమి సుజాత, చెన్నా పార్వతి, పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

తగరపువలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 1వ వార్డు కొండపేటలో టీడీపీ కార్యకర్తలకు నాయకులు మంగళవారం సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి పిట్టా సురేశ్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి తాటిపూడి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సూరిబాబు, గిడుతూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం, అనంతవరం గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలకు ఆ పార్టీ నాయకుడు, భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెదఎర్రినాయుడు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి గొర్రెపాటి వెంకటలక్ష్మి, నాయకులు ఎస్. వెంకటరావు, అప్పారావు, అప్పల సూర్యనారాయణ, అప్పలనాయుడు, ఎస్. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పీ 4తో పేదలకు మేలు'

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పీ 4 విధానం పేదలకు వరమని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేశ్ కుమార్ అన్నారు. మంగళవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వినూత్న పథకాలు, కార్యక్రమాలను రూపొందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిట్ట అని, ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సంపన్న వర్గాలు చేయూతనివ్వడమే పీ 4 విధానమన్నారు. ఇది ఆచరణలోకి వస్తే పేదల జీవితాల్లో మార్పు వస్తుందని తెలిపారు.

భీమిలిలో 93.63 శాతం పింఛన్ల పంపిణీ

భీమునిపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్ పరిధిలో సామాజిక పింఛన్లను మంగళవారం నాటికి 93.63 శాతం మేర పంపిణీ చేశామని జోనల్ కార్యాలయం అధికారులు తెలిపారు.ఉదయం 7 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జోన్‌లో వున్న 1 నుంచి 4 వార్డుల్లో మొత్తం లబ్ధిదారులు 8520 మంది వుండగా, రూ. 3,68,86,000 పింఛన్ల సొమ్ము అందించాల్సి ఉండగా తొలిరోజు 7977 మందికి రూ. 3,43,92,500 అందించామన్నారు. కార్యక్రమంలో జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి, ఏపీడీ దొర, తదితరులు పాల్గొన్నారు.

ఏడో వార్డులో ....

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని పిలకవానిపాలెంలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వార్డు సచివాలయ సిబ్బంది మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డులో టీడీపీ నాయకులు చెట్టుపల్లి గోపి, బి. దొరబాబు, మంగాదేవి పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు పరిధిలో నలుగురు మహిళలకు కొత్తగా వితంతు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి బాబూరావు, దువ్వి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పార్కుల ఏర్పాటుకు భూ సేకరణ

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కోసం పీఎం కుసుం పథకంలో భాగంగా సోలార్ పార్కుల ఏర్పాటుకు అధికారులు భూసేకరణ చేపట్టారు. ఈమేరకు తహసీల్దారు కె. ఆనందరావు, ఆనందపురం ఏడీఈ రాజశేఖర్ కృష్ణాపురం, పాండ్రంగి, రెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఒక్కో సోలార్ పార్కు ఏర్పాటుకు 20 ఎకరాలు అవసరం కాగా మూడు పార్కుల ఏర్పాటునకు 60 ఎకరాలు సేకరించనున్నట్టు అధికారులు తెలిపారు.

నేడు పద్మనాభం సంతలో ఆశీలు వసూలుకు వేలం

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ప్రతి బుధవారం జరిగే సంతలో ఆశీలు వసూలుకు 2న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యాదర్శి సువర్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఈ వేలంలో పాల్గొనేవారు రూ. 5 వేలు ప్రథమ ధరావత్తుగా చెల్లించాలన్నారు.




గతంలో రెడ్డిపల్లి సాయిబాబా మందిరం సమీపంలో రోడ్డు దుస్థితి (ఫైల్), బీటీ పనులు పూర్తి కావడంతో అద్దంలా కనిపిస్తున్న రోడ్డు

నాడు అధ్వానం.. నేడు అద్దం

- పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం
- 80 శాతం బీటీ పనులు పూర్తి
- వాహనదారుల్లో ఆనందం

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 80 శాతం బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులకు 2021లో వైసీపీ ప్రభుత్వం నిధులు ఇస్తామని ప్రకటించింది. ఈమేరకు నాయకులు పనులకు భూమి పూజ చేయగా సకాలంలో నిధులు విడుదల



రెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో గతంలో రోడ్డు దుస్థితి, (ఫైల్) ప్రస్తుతం సుందరంగా కనిపిస్తున్న రోడ్డు



కాకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక రహదారుల మరమ్మతుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రోడ్డు పొడవునా పెద్ద, పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రజలు నరకయాతన పడ్డారు. రోడ్డు దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు రావడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేకంగా రోడ్డును పరిశీలించి మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు. వారు పనుల్లో వేగాన్ని పెంచారు. విస్తరణలో భాగంగా పద్మనాభం నుంచి శేరిఖండం వరకు రెడ్డిపల్లిలో శాంతినికేతన్ పాఠశాల వరకు బీటీ రోడ్డు వేశారు. రెడ్డిపల్లి పాఠశాల నుంచి స్టేట్ బ్యాంకు వరకు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రెడ్డిపల్లి సినిమా హాలు వద్ద కల్వర్టు నిర్మించాల్సి ఉంది. గుంతలు లేని రోడ్లలో ప్రయాణం సాఫీగా సాగుతుండడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూములిచ్చిన రైతులను ఆదుకుంటాం

- ఎంవీపీ, మిథిలాపురి కాలనీలకు దీటుగా జీఎస్ అగ్రహారం లే-అవుట్
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరం పంచాయతీ గంగసాని అగ్రహారం లే-అవుట్‌ను ఎంవీపీ కాలనీ, మధురవాడ మిథిలాపురి లే-అవుట్‌లకు దీటుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఫలసాయాన్ని వదులుకుని 245 ఎకరాలిచ్చిన రైతుల తొమ్మిదేళ్ల ఎదురుచూపునకు తెర పడిందని చెప్పారు. మంగళవారం



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ఆయన మండల పరిషత్ కార్యాలయంలో భూములిచ్చిన రైతులు, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైవే నుంచి లేఅవుట్‌కు 80 అడుగుల రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు.ఎన్నో ఏళ్ల క్రితం భూములిచ్చి దాని ద్వారా రావాల్సిన లబ్ధి కోసం ఓపిగ్గా ఎదురు చూస్తున్న రైతులకు మరింత లాభం కలిగేలా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణను కోరామన్నారు. గూగుల్, టీసీఎస్ వంటి అత్యున్నత సంస్థలు విశాఖకు రానున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో నివాస స్థలాలకు డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో ల్యాండ్ పూలింగ్ చేసినప్పుడు ప్రజలకు నమ్మకం కలిగించేలా రైతులకు త్వరితగతిన స్థలాలు అందించాలని అధికారులకు సూచించారు. లేఅవుట్ అభివృద్ధి పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ 2016లో గృహ నిర్మాణానికి 245 ఎకరాల్లో 85 ఎకరాలను ప్రాథమికంగా 6 నుంచి 9 నెలల్లో లేఅవుట్ వేసి రైతులకు కేటాయిస్తామని ప్రకటించారు.ఒకటి రెండు నెలల్లో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.



శివశక్తినగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అర్హులందరికీ పింఛన్లు

కొమ్మాది : నియోజకవర్గంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన 5వ వార్డు శివశక్తినగర్‌లో కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులై ఉండి, పింఛన్ రాకపోతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతిసత్యనారాయణ,జడ్పీ కనకమహాలక్ష్మి, నమ్మి శ్రీను, ఏపీడీ శ్రీరామ్, ఏఎంహెచ్‌ఓ కిశోర్, ఈఈ శాంతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేవిడిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

పద్మనాభం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో అన్యాక్రాంతం అయిన డీపట్టా భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దారు కె. ఆనందరావు ఆధ్వర్యంలో సర్వే నెంబరు 124లో 1.50 ఎకరాలు పరుల స్వాధీనంలో ఉండగా, వివాదాలు నెలకొనడంతో ఆ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డు పెట్టారు. ఈ భూమిని 1991లో అదే గ్రామానికి చెందిన సారిక అప్పన్నకు డీపట్టా ఇచ్చారు. ప్రస్తుతం అప్పన్నకు చెందిన వారు ఎవరూ ఈ భూమిలో లేరు. భూముల విలువ పెరిగిపోవడంతో ఆ భూమి వేరే వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. వీఆర్వో నివేదిక మేరకు తహసీల్దారు భూమిని పరిశీలించి, అసలైన లబ్ధిదారుడు భూమి మీద లేకపోవడంతో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు ఇస్తామని తహసీల్దారు తెలిపారు. ఈ భూమి విలువ సుమారు రూ. 5 కోట్ల వరకు ఉంటుంది. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు శామ్యూల్, స్వామి పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు వద్ద తహసీల్దార్ ఆనందరావు

కుటుంబ సాధికార సారధుల ఎంపికపై సమీక్ష

ఆనందపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలసలో శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ టీడీపీ కార్యకర్తలు, కుటుంబ సాధికార సారధులతో మంగళవారం సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పార్టీ అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందేలా ప్రతిఒక్కరూ చూడాలన్నారు. ఈమేరకు కుటుంబ సాధికార సారధులతో సమీక్ష నిర్వహించి, విధివిధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఘట్టమనేని సుభాస్ చంద్రబోస్, బీఆర్‌బీ నాయుడు, బమ్మిడి ఉమ, మీసాల సత్యనారాయణ, శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని ప్రతి గ్రామంలోనూ కుటుంబ సాధికారిక కమిటీలు ఏర్పాటు చేస్తామని గంటా రవితేజ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 1,2,3,4 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు సుబ్బారావుకు నివాళి



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘం నాయకుడు సుబ్బారావు ఆశయ సాధనకు కార్మికులంతా కృషి చేయాలని మధురవాడ జోన్ సీఐటీయూ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు పిలుపునిచ్చారు. సుబ్బారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఏడో వార్డులోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపం వద్ద సమావేశం నిర్వహించారు. తొలుత నాయకులు సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కార్మిక, శ్రామిక వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీటూ నాయకులు సన్నీ, రాజు, శేషు, సూరిబాబు, అప్పారావు, అర్జునమ్మ, తదితరులు పాల్గొన్నారు.

24న భవన నిర్మాణ కార్మికుల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నా, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ విమర్శించారు. మంగళవారం 98వ వార్డులో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక శాఖ వద్ద కార్మికుల క్లైమ్‌లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని, కానీ నెలలు గడుస్తున్నా.. ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ విషయమై కార్మిక శాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేకపోవడంతో ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద నిరసన తెలపాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ముద్దాడ వరప్రసాద్, ఎం. రామునాయుడు, నారాయణస్వామి, డివి రమణ, నరసింహులు, అప్పారావు, పాల్గొన్నారు.

'వృత్తి పట్ల బాధ్యత ఉండాలి'

కొమ్మాది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే అధికారులు ప్రజల మన్ననలు పొందుతారని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో



ఏఏఓగా పని చేసి, ఏఓగా పదోన్నతి పొంది తూర్పుగోదావరి జిల్లా పోలీస్ ఫిర్యాదుల అథారిటీకి బదిలీపై వెళుతున్న బీవీ రామారావును మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి. సత్యం, ఎన్. మురళీధర్, జి. ఇలియా సాగర్, వి. నారాయణరావు పాల్గొన్నారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఈఓ సుబ్బారావు, ఆలయ అధికారులు

అప్పన్న ఉత్సవాలకు రావాలని మంత్రి ఆనంకు ఆహ్వానం

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 8న రాత్రి 10 గంటలకు జరగనున్న వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణం, వైశాఖమాస శుక్లపక్ష తృతీయ అనగా ఈనెల 30న జరిగే స్వామివారి చందనోత్సవానికి రావాలని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈఓ కె. సుబ్బారావు ఆహ్వానించారు. మంగళవారం ఆయన విజయవాడ సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు ఐవీ రమణమూర్తి, వేద పండితులు సుబ్రహ్మణ్యశర్మ మంత్రిని వేద స్వస్తి వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం ఈఓ స్వామివారి శేషమాలికతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను మంత్రికి అందజేశారు.

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (18521)కు ఏడాది పొడవునా తీవ్ర డిమాండ్ ఉంటోంది. డబుల్ డెక్కర్‌కు మొదటినుంచి ఆదరణ అంతంతమాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు), తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలకు) అనుకూలంగా లేకపోవడం, సుమారు 14 గంటలు కూర్చొని ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణికులు డబుల్ డెక్కర్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతో పాటు స్లీపర్ క్లాసు కోచ్‌లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది.కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ బెర్తులు అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్నాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879), ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లకు మే నెలాఖరులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో ఒకటి, అరా బెర్తులు మినహా మిగిలినవి ఫుల్ అయిపోయాయి.

డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలుకు ఖాళీలు

వారానికి మూడు రోజులు అందుబాటులో ఉండే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయి. అలాగే ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతికి ఏప్రిల్ 28 వరకు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు (08583) బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైలు పట్టాలెక్కిన రోజు నుంచి పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కనీసం వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం విశాఖలో బయలుదేరి మన్మాడ్ మీదుగా నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లో కూడా మే నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి.

రోడ్డునపడ్డ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

చెన్నై, హైదరాబాద్‌లకు బదిలీ చేశారు. దాంతో రక్షణ కొరవడిందని ఆలస్యంగా గుర్తించి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) ద్వారా కొంత మందిని నియమించుకోవాలని యత్నిస్తున్నారు. వారికి లేఖ రాయడంతో స్టీల్‌ప్లాంటులో పనిచేయడానికి ఆసక్తి కలిగిన కమాండెంట్లు పేర్లు ఇవ్వాలని ఆ సంస్థ మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఉన్న వారిని పంపించేసి కొత్త వారిని తెచ్చుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

కీలక సమావేశాల నిర్వహణకు ఫుల్‌స్టాప్

స్టీల్‌ప్లాంటులో ఏడాదికి రెండు సార్లు కీలక సమావేశాలు నిర్వహించి ఉద్యోగులలో స్ఫూర్తిని నింపి లక్ష్యం వైపు నడిపించడం ఆనవాయితీ. ప్రతి జనవరి 1, తేదీన, ఆర్థిక సంవత్సరం మొదటి తేదీ (ఏప్రిల్ 1)న డిప్యూటీ జనరల్ మేనేజర్ పైస్థాయి అధికారులతో సీఎండీ, డైరక్టర్లు ఉక్కు నగరం క్లబ్‌లో సమావేశమైన అప్పటివరకు ప్లాంటు సాధించిన ఉత్పత్తి, వచ్చిన లాభనష్టాలు, రాబోయే మూడు నెలలో చేయబోయే కీలక పనులు అన్నింటిపైనా చర్చిస్తారు.

ఆ తరువాత వాటి వివరాలను ఆయా అధికారులు విభాగాల్లో సిబ్బందికి చెప్పి లక్ష్యం దిశగా పని చేయిస్తారు. అయితే ఈ సమావేశాలు ఏపీ గత ఏడాది నుంచి నిర్వహించడం లేదు. ముఖ్యంగా ఇన్‌ఛార్జి సీఎండీ అజయ్ సక్సేనా వచ్చినప్పటి నుంచి అధికారులతో ఏమీ చర్చించడం లేదు. ఏప్రిల్ 1న (మంగళవారం) ఆయన విశాఖపట్నంలోనే లేకుండా వెళ్లిపోయారు. ఫిబ్రవరి 18న ఉక్కు వ్యవస్థాపక దినం. ఆ రోజున బాగా పనిచేసిన వారికి నెహ్రూ అవార్డులు ఇస్తుంటారు. ఈసారి అది కూడా చేయలేదు.

అవినీతి జబ్బుకు ట్రీట్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

పత్రాలను ఇచ్చేందుకు పోలీసులతోపాటు మృతుడి కుటుంబ సభ్యులను ఆమె తన ఛాంబర్‌కు పిలిపించుకుంటున్నారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు ఎవరికీ రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నారు. అలాగే, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ప్యాక్ చేసేందుకు అవసరమైన కవర్, ఇతరత్రా సామగ్రిని మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో ఛాంబర్‌లోనే అందజేస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయి వెళ్లిపోయే ముందు మరోసారి సదరు కుటుంబ సభ్యులు ఆమె వద్దకు వెళ్లి డబ్బులు అడిగిందీ, లేనిదీ చెప్పాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఈ మేరకు సంతకాలు కూడా తీసుకుంటున్నారు. విభాగాధిపతే ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించడం, నేరుగా మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులతోనే మాట్లాడుతుండడంతో సిబ్బంది డబ్బులు అడిగేందుకు భయపడుతున్నారు. కవర్లు, ఇతర సామగ్రి విక్రయించే వ్యక్తులను కూడా మార్చురీ వద్ద లేకుండా చేశారు. దీనివల్ల ప్రక్రియ సాఫీగా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

రోజుకు పదికిపైగా...

ప్రతిరోజూ కేజీహెచ్‌లోని ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో పది నుంచి 12 వరకు పోస్టుమార్టాలు నిర్వహిస్తుంటారు. కనిష్ఠంగా ఐదు వేలు వేసుకున్నా రోజుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ వసూలు చేసేవారు. దీనికి విభాగాధిపతి డాక్టర్ కె.మమత చెక్ చెప్పారు. ఇప్పుడు మొత్తం ప్రక్రియ పూర్తయిన తరువాత కిందిస్థాయి సిబ్బంది వందో, రెండొందలో అడగడం తప్ప..ఇంత ఇవ్వాలని డిమాండ్ చేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. నిరుపేదలకు ఇబ్బందులు కలుగుతున్న విషయం తమ దృష్టికి రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు డాక్టర్ మమత తెలిపారు. ఎంతోమంది అప్పు చేసి మరీ ఇక్కడ సిబ్బందికి డబ్బులు ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, అందుకే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు ఆమె తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో దానికి సంబంధించి పనులు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది.

ప్ర: పర్యాటక ప్రాజెక్టులకు సింగిల్ విండో అనుమతులు ఎప్పటి నుంచి ఇస్తారు?

జ: రెండు రోజుల క్రితమే సింగిల్ విండోకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తులను ప్రాసెస్ చేస్తాం.

ప్ర: భీమిలి మండలంలో పర్యాటక శాఖకు భూములిచ్చారా?

జ: శారదాపీఠం నుంచి వెనక్కి తీసుకున్న 15 ఎకరాలిస్తే పర్యాటక ప్రాజెక్టులు చేపడతామని ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్ర: బంగ్లాదేశ్ నౌకను రెస్టారెంట్‌గా మార్చేలా అనుమతులు వచ్చాయా?

జ: అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చింది. ఇటీవల విజయవాడలో సీఆర్‌జెడ్ సమావేశం జరిగింది. త్వరలోనే వారు కూడా అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు గీతం ఉద్యోగి ఎంపిక

సాగర్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు గీతం ఉద్యోగి ఆదారి నరసింగరావు (సింగ్) ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆయన రెండు బంగారు పతకాలు సాధించారు. గతంలోనూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు పొందారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?



రోడ్డు విస్తరణకు నోచుకోక ఇరుకుగా ఉన్న వంతెన



వంతెన విస్తరణకు అడ్డంకిగా మారిన పైపులైన్లు

- విస్తరణకు నోచుకోని ఎంవీపీ ప్రధాన రహదారి
- తాగునీటి పైపులైన్లు మార్చాల్సి ఉండడంతో పనులు చేపట్టేందుకు వెనుకంజ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ బీచ్ రోడ్డుకు వెళ్లాలంటే ప్రధాన రహదారిని వినియోగిస్తున్నారు. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ బాగా పెరిగింది. ఎంవీపీ ప్రధాన రహదారిని రెండు లైన్లుగా విభజించాల్సి ఉంది. ఇది ఇప్పట్లో అయ్యేలా లేదు. మెడికవర్ ఆస్పత్రి నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ విశాలమైన రహదారి ఉంది. అయితే వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వెనుక ఉన్న ఈ దారిని కలిపేందుకు గెడ్డపై ఉన్న వంతెన కేవలం ఎనిమిది అడుగులు మాత్రమే ఉంది. దీనివల్ల వంతెనపై ఒక కారు వస్తే, ఎదురుగా మరో ఆటో కూడా తప్పుకోలేని పరిస్థితి. ఈ వంతెన విస్తరిస్తే తప్ప, ఈ రహదారి పూర్తిగా వినియోగంలోకి రాదు.

ప్రధాన పైపులైన్లు తొలగించాల్సిందే!

వంతెన ఆనుకుని గెడ్డపై గోదావరి నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లు ఉన్నాయి. వంతెన వెడల్పు చేయాలంటే పైపు లైన్లు తొలగించాలి. జీవీఎంసీ పద్దెనిమిదో వార్డు పరిధిలో ఉన్న ఈ సమస్యను తొలగించాల్సి ఉంటుంది. ఈ రహదారిని వెడల్పు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ కేవలం తాగు నీటి పైపు లైన్లు తొలగింపు ప్రక్రియ చేపట్టేందుకు వెనకడుగు వేసి, విస్తరణ ప్రతిపాదన అటకెక్కించారు.

వంతెన కింద నుంచి పైపు లైన్లు వెళ్లేలా డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే అటూ ఇటూ జరపడానికి వీలు లేదు. దీనికి నివాసాలు అడ్డు వస్తాయి. తాత్కాలికంగా పైపులైను మళ్లించడమో లేదా కింది నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటేనే వంతెన వెడల్పు చేయడానికి అవకాశం ఉంటుంది. వంతెన పూర్తయిన తర్వాత కింద భాగం నుంచి పైపు లైన్లు వెళ్లేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

ప్రధాన రహదారిలో రద్దీ తగ్గుతుంది

ఎంవీపీ అప్పుఘర్ వరకూ ప్రధాన రహదారిలో రద్దీ బాగా ఉంటోంది. ఇరువైపులా వ్యాపార సంస్థలు ఉండడం వల్ల రహదారిలో వాహనాల పార్కింగ్, ఆస్పత్రులు, రైతు బజార్ వంటి వాటికి వెళ్లే వాహనాలతో రద్దీ నిరంతరం ఉంటుంది. వంతెన విస్తరిస్తే నేరుగా ఎంవీపీ కాలనీ అప్పుఘర్ వరకూ వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ దారిలో ఇరువైపులా నివాసాలు మాత్రమే ఉండడం, రహదారి వెడల్పుగా ఉండడం వల్ల ప్రయాణం సులభమవుతుంది. పైగా రెండు రహదారులుగా డివైడర్ కూడా వేస్తే మరింత అందంగా రహదారి తయారవుతుంది. అధికారులు ఈ దిశగా ఆలోచించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం నేతలు

అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలి

- సీపీఎం నేత, కార్పొరేటర్ గంగారావు పిలుపు

మద్దిలపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని మధురైలో నిర్వహించే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, కార్పొరేటర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన మహాసభల పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధురైలో జరిగే మహాసభల్లో పేదలు, కార్మికుల సమస్యలపై చర్చించి రాబోయే మూడేళ్ల పార్టీ నిర్వహించాల్సిన పోరాటాలు రూపొందిస్తారన్నారు. సీపీఎం నాయకులు చలపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. అనంతరం జి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పద్మావతి, కె.కుమారి, కుమార్ మంగళం, అనపర్తి అప్పారావు త్రినాథ్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

- నేతల పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

కంచరపాలెం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 2 నుంచి ఆరో తేదీ వరకు తమిళనాడులో జరగనున్న సీపీఎం అఖిలభారత 24వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనం వద్ద మంగళవారం పతాకావిష్కరణ చేశారు. సమసమాజ నిర్మాణమే సీపీఎం ధ్యేయమన్నారు. ప్రతి ఒక్కరికీ తిండి, ఉండేందుకు నివాశం, పని, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు సోషలిస్టు సమాజం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.జయలక్ష్మి,ఎస్.అప్పలరాజు, బి.పద్మతో పాటు ఒమ్మి అప్పారావు, ఈశ్వరరావు, శ్రావణ్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- ●**రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- ●**మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- ●**పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- ●**కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- ●**ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



15వ వార్డులో కొత్త మంజూరైన వారికి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పించన్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం పంపిణీ చేశారు. కొత్త వెంకోజీపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేగి శోభకు డయాలిసిస్ పెన్షన్‌ను, జంపా కనకమ్మ, సూరిశెట్టి గౌరీలకు వితంతు పించన్లను అందజేశారు. అర్హులై ఉండి పించన్లు పొందలేని వారు ఎవరైనా ఉంటే తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే సూచించారు. పేదలందరికీ ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, అప్పారి గిరిబాబు, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఇతర నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : బ్యాంకులకు వరుస సెలవు కావడంతో పించను వస్తుందో రాదోనన్న లబ్ధిదారుల సందేహాలను తోసిరాజని, మంగళవారం ఉదయమే యథావిధిగా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయడంతో నగదుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు అందించామని పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి తెలిపారు. ఠంచనుగా పింఛను ఇవ్వడంపై లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.



ఎంవీపీ కాలనీ : పింఛన్లు అందజేస్తున్న 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలేనికి చెందిన సత్యసాయి భక్తురాలు, స్వర్గీయ శరగడం వెంకయ్యమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయుడు శరగడం సుధాకర్ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షులు కర్రి వెంకట సూర్య అప్పారావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మజ్జిగను, ఆ తరువాత తాగునీటిని పంపిణీ చేయనున్నట్టు సుధాకర్ తెలిపారు. గత ఏడాది కూడా సుమారు రెండు నెలల పాటు ఈ మజ్జిగ పంపిణీ చేపట్టామని, ఈ ఏడాది కూడా రెండు నెలల పాటు చలివేంద్రం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి.రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు సుబ్బారావుకు నివాళి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలతో పాటు పారిశ్రామిక ప్రాంత ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాటాలు చేసిన ఘనత రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దివంగత సి.సుబ్బారావుకే దక్కుతుందని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. షీలానగర్‌లో మంగళవారం జరిగిన సుబ్బారావు వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాం బాబు, సత్యవతి, ఎ.లోకేశ్, వెంకటరెడ్డి, పీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో 106 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న 106 మంది ఉద్యోగులు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే వీఆర్ఎస్ ద్వారా చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా నెలకు కనీసం వందకు తక్కువ కాకుండా పదవీ విరమణలు జరుగుతున్నాయి.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిర్వహించనున్న బైక్ ర్యాలీ, హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, శోభాయాత్ర కన్వీనర్ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజనల్ అధికారి మాయా సుందరరాజన్



మాట్లాడుతున్న మాయా సుందరరాజన్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధనలకు అందించే వివిధ స్కాలర్‌షిప్‌లను భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజనల్ అధికారి మాయా సుందరరాజన్ పేర్కొన్నారు. ఏయూ సైన్స్ కళాశాల పరిధిలో ఫుల్ బ్రైట్ నెహ్రూ స్కాలర్‌షిప్‌తో పాటు వివిధ స్కాలర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మాయా సుందరరాజన్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నత విద్య, సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఈ స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్ 1946లో ప్రారంభమైందని, ప్రస్తుతం 160 దేశాల్లో ఇది అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ నాలుగు లక్షల మందికి ఈ స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో ఉన్నత విద్యను పొందే అవకాశం లభించిందన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధన జరపడానికి ఎంతో ఉపయోగంగా స్కాలర్‌షిప్‌లు నిలుస్తాయన్నారు.

ఈ స్కాలర్‌షిప్ సాధించిన వారు విదేశాల్లో పొందే వివిధ సదుపాయాలు, అవకాశాలు తెలియజేశారు. ఏ దేశంలో పరిశోధన చేయాలి అనే అంశంపై నిర్దిష్ట అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అమెరికన్ కార్నర్ కో-ఆర్డినేటర్ ఆచార్య పాల్ డగ్లస్, విభాగాధిపతులు ఆచార్యులు సంధ్యాదీపిక, జానకిరామ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారును తనిఖీ చేసిన స్పెషల్ సీఎస్



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జేసీ తదితరులు

ఎంవీపీ కాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీలోని రైతు బజార్‌ను ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. కూరగాయల ధరలు, రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులతో ప్రవర్తన తదితర అంశాలపై ఆయన రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రైతు బజారు అంతా కలియతిరిగి, పరిశుభ్రత, క్రమశిక్షణపైసిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ వెంట జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు ఉన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణమా!

- సివిక్ ఎక్స్‌నోరా దసపల్లా హిల్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు



మద్యం షాపు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్న భవనం

రామ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ సివిక్ ఎక్స్‌నోరా దసపల్లా హిల్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. జీవీఎంసీ 28వ వార్డు పరిధి దసపల్లా హిల్స్‌లో మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని కోరుతూ మార్చి 5న జిల్లా కలెక్టరెట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా మార్చి 29న జీవీఎంసీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ మద్యం షాపును దసపల్లా హిల్స్‌లోని తూర్పు నావికాదళం ప్రధాన అధికారి నివాసం కార్యాలయం పక్కన, గవర్నర్ బంగ్లా ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న నివాస భవనంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ చుట్టు పక్కలా ప్రముఖుల నివాసాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా సమీపంలో సుమారు వంద మీటర్ల దూరంలో విశాఖ నగరంలో అత్యంత ప్రాచీనమైన సెయింట్ పాల్స్ చర్చి సైతం ఉందన్నారు. దేవాయాలు, ప్రార్థనా స్థలాలా సమీపంలో మద్యం షాపు నిర్వహణకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని వారు కోరారు.

లలితాపీఠంలో సీతాదేవిపై ప్రవచనాలు



ప్రవచనం వినిపిస్తున్న కనకమహాలక్ష్మి

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వసంత నవరాత్రుల సందర్భంగా లలితాపీఠంలో స్త్రీల రామాయణ పాటల ప్రసంగాల్లో భాగంగా మంగళవారం రాత్రి పాటల్లో సీతాదేవి అనే అంశంపై గాయత్రి కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి ప్రసంగించారు. సీత గడియ, సీతా రావణుల సంభాషణల, స్త్రీల వేవిళ్ళు తదితర పాటలు ఆలపించి జానపదుల విశ్వాసాలు, వారు సీతాదేవిని తమలో ఒకరిగా భావించుకోవడం, వారికి ఆమెపై గల ఆపేక్ష తదితర విషయాలను వివరించారు. ఇతర రామాయణాల్లో కంటే జానపద రామాయణాల ప్రత్యేకతను, స్త్రీల స్వభావాన్ని జానపద కవయిత్రులు భావించిన తీరును చక్కగా వివరించారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణ సేన్ ప్రవచనకర్తను సత్కరించారు.

విశ్వ బ్రాహ్మణులు ఐక్యతతో మెలగాలి

- జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండబాబు



కొండబాబుకి గానాల రాంమూర్తి స్మారకపురస్కారం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : విశ్వ బ్రాహ్మణులంతా ఐక్యంగా మెలగాలని, అప్పుడే అబివృద్ధి సాధ్యమని రాష్ట్ర స్వర్ణకార సంఘం విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండ బాబు పేర్కొన్నారు. ఉగాది నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక రవీంద్రనగర్‌లో నున్న వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కీ.శే. గానాల రాంమూర్తి స్మారక పురస్కారాల కార్యక్రమంలో ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. తన సేవలను గుర్తించి కీర్తిశేషులు నాగాల రామూర్తి స్మారక పురస్కారం అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ కన్వీనర్ గోడి నరసింహాచారి, 39 వార్డు మాజీ కార్పోరేటర్ జనసేన నాయకుడు బోదలుపాటి ఉమామహేశ్వరారావు, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి గిడిజాల పార్వతీశం, కోశాదికారి ఎ.సత్య చంటిబాలు, విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు సురేష్, రవీంద్రనగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కానూరి శశికుమార్, కానూరి లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టు కానూరి వేణు తదతరులు పాల్గొన్నారు.

రహదారిపై ఆకర్షణగా పూల సోయగం



రహదారి మధ్యలో మొక్కలకు పూచిన పూలు

ఆరిలోవ : హనుమంతవాక జంక్షను నుంచి ఆరిలోవ వెళుతున్న రోడ్డులో జీవీఎంసీ వేసిన పూల మొక్కలు నిండి విరగబూశాయి. దీంతో ఆ ప్రాంతంలో వెళ్లే వారికి ఈ పూల చెట్లు ఆకట్టుకుంటున్నాయి. ఈ సీజన్‌లో ఈ పూలు పూస్తాయి. తెల్లని పూలతో చెట్టు నిండి పూసిన ఈ పూల మొక్కలు రహదారిలో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో చక్కని గాలికి పరిమళం వెదజల్లుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవాహనచోదకులు చక్కని వాతావరణాన్ని ఆహ్లాదిస్తూ ప్రయాణం చేస్తున్నారు.

16వ వార్డులో దుకాణాల తొలగింపు



బడ్డీలను తీసివేస్తున్న వ్యాపారులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో సులబ్ కాంప్లెక్సు ఎదురుగా స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న బడ్డీలను వెంటనే తొలగించాలని స్టీల్ ప్లాంట్ ఎస్టేట్ అధికారి జనార్థన్ ఆదేశాల మేరకు మంగళవారం దుకాణదారులు స్వచ్ఛందంగా ఖాళీగా ఉన్న బడ్డీలను తొలగించారు. మిగిలిన వారు కూడా వెంటనే తమ బడ్డీలను తొలగించాలని లేకుంటే బందోబస్తుతో వచ్చి బడ్డీలను తీసేయడం జరుగుతుందని ఎస్టేట్ అధికారి హెచ్చరించారు. అయితే తమకు విద్యుత్ శాఖ వారు విద్యుత్ మీటర్లను కూడా మంజూరు చేశారని, నిజంగా బడ్డీలను తీయాలంటే ముందు విద్యుత్ శాఖ వారు మీటర్లను తీస్తే, తాము బడ్డీలను తీసివేస్తామని దుకాణదారులు చెబుతున్నారని ఎస్టేట్ అధికారి పేర్కొన్నారు. కాబట్టి విద్యుత్ శాఖ, జీవీఎంసీ అధికారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

13వ వార్డులో పింఛన్ల పంపిణీ

ఆరిలోవ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు పొత్కండి ధర్మారావు, కార్యదర్శి యల్లమల్లి సురేష్ మంగళవారం వార్డు పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ అందజేశారు. అలాగే 12వ వార్డులోని లీలా సుందరయ్యనగర్‌లో పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి): రాబేయే రోజుల్లో ఎండ ఎక్కువగా ఉంటుందని, పాదచారులు, వాహనదారులకు దహార్తిని తీర్చే విధంగా అన్ని ప్రాంతాల్లో ఎక్కువ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల భూలోకమాత అమ్మవారి ఆలయం వద్ద వార్డు బిజెపి నాయకుడు మజ్జి ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పరశురామ్‌రాజు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. తాను తన ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుకు కృషి చేస్తానని, అదే విధంగా పలువురు ముందుకు వచ్చి అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పరశురామ్‌రాజు కోరారు. కార్యక్రమంలో రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, క్రాంతినగర్ ప్రాంతాల గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా వరప్రసాద్ జన్మదిన వేడుకలు



వరప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

మురళీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ జన్మదిన వేడుకలను మంగళవారం వార్డులో ఘనంగా జరిపారు. సీనియర్ నాయకులు రామచంద్రరావు, పెంటకోట శ్రీనివాసరావు ఇతర ప్రధాన కార్యకర్తలు వరప్రసాద్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తుల్లో మరింత ఉన్నత స్థాయి పదవులు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. వార్డు సచివాలయాల సెక్రటరీలు, జీవీఎంసీలో పలు విభాగాల ఉద్యోగులు వరప్రసాద్‌ను కలిసి శాలువా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు ప్రగతికి వరప్రసాద్ సేవలు ఎంతో అవసరమని స్థానికులు, పార్టీ అభిమానులు పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీగౌరీ రామలింగేశ్వర ఆలయంలో పండితులు వరప్రసాద్ పేరిట ప్రత్యేక పూజాభిషేకాలు చేపట్టి ప్రసాదాలు అందించారు.

సరస్వతీ పార్కు ప్రవేశమార్గంలో కటౌట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కటౌట్లు తొలగించడంతో ప్రవేశానికి అనువుగా మారిన స్థలం

డాబాగార్డెన్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ పార్కు స్థానికులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందిస్తోంది. అయితే, ఇటీవల కొన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇక్కడ ఫ్లెక్సీలు, కటౌట్ల కోసమే పెద్ద పెద్ద కర్రలు పెట్టి ఒక వైపు మార్గాన్ని మూసివేశారు. దీంతో ఈ సమస్యపై 'సరస్వతీ పార్కులోకి ప్రవేశం ఎలా?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 27న ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పార్కులోకి సందర్శకులు వెళ్లడానికి వీల్లేకుండా మూసి ఉన్న ద్వారాన్ని తెరిపించారు. మొత్తం కర్రలు తొలగించడంతో పాటు కటౌట్‌లకు సంబంధించి హోర్డింగ్‌కు ఉపయోగించే చార్డులను తొలగించారు.

దీంతో పార్కులోకి వెళ్లడానికి మార్గం సుగమమైంది. సమస్య పరిష్కారం కావడంతో సందర్శకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిప్లొమా కోర్సులతో విస్తృత ఉపాధి అకాశాలు

» ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణ



మాట్లాడుతున్న కేవీ రమణ

కంచరపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అనంతరం డిప్లొమా కోర్సుల్లో చేరితే త్వరితగతిన ఉపాధి లభించే అవకాశం ఉందని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీ రమణ పేర్కొన్నారు. మంగళవారంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన నేపథ్యంల ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శాంతినికేతన్ పాఠశాలలో మంగళవార నిర్వహించిన కార్యక్రమంలో 'పదో తరగతి అనంతరం డిప్లొమా కోర్సులపై అవగాహన కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో చేరితే చక్కని ఉపాధి వకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాలీసెట్‌లో ర్యాంకు పొందడం ద్వారా ఆసక్తి ఉన్న బ్రాంచిల్లో చేరవచ్చన్నారు. కెమికల్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు పొందిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఈదుల శ్రీనివాస్, సిబ్బంది శ్రీరెడ్డి, లాల్, స్వాతి, సరస్వతి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



రైల్వే న్యూ కాలనీలోని కేంద్రం నుంచి పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు ముగిశాయి. గత నెల 17న ప్రారంభమైన పది పరీక్షలు మంగళవారం సోషల్ పరీక్షతో ముగిశాయి. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, లలితా నగర్, రైల్వే న్యూ కాలనీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటలకు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల్లోకి పంపించి వారు పరీక్ష రాసి తిరిగి వచ్చే వరకు బయటే తల్లిదండ్రులు వేచి ఉండేవారు. ఈ పరీక్షలన్నీ కూడా చాలా బాగా రాశామని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆనందంగా తెలిపారు. ఎన్జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శతశాతం విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ మాణిక్యం తెలిపారు. ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల కోసం ఇన్నాళ్లు పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులకు ఇక ఆటవిడుపు లభించిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

మాధవధారలో..

మాధవధార, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మార్చి 17న ఆరంభమైన పరీక్షల్లో 7 పేపర్లు చొప్పున విద్యార్థులు మాధవధార, మురళీనగర్ కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారు. జీవీఎంసీ 50వ వార్డు మాధవధార హైస్కూలు, 49వ వార్డు బర్మా క్యాంప్ కె.కాలనీ జీవీఎంసీ హైస్కూలు సహా ఈ ప్రాంతలోని పలు ప్రైవేటు బడుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ పదవ తరగతి పరీక్షల సమయంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, విద్యార్థుల డిబార్, మాస్ కాపీయింగ్ లేకుండా విజయవంతంగా ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ వీరారావు బుజ్జి

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లోని సచివాలయాల పరిధిలో అడ్మిన్లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం పింఛన్లను కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు గొలగాని వీరారావు బుజ్జి పంపిణీ చేశారు. ఇందులో భాగంగా దొండపర్తి ప్రాంతంలో ఇద్దరు వితంతువులకు స్పౌస్ పింఛన్లను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో నూతనంగా స్పౌస్ పింఛన్‌ను ప్రభుత్వం అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

భర్తకు వస్తున్న పింఛన్‌ను ఆయన మృతి చెందడం వల్ల భార్య రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఆ పింఛన్‌ను మృతుడి భార్యకు తక్షణమే అందించడం హర్షించదగ్గ నిర్ణయమన్నారు. కుమ్మరి వీధికి చెందిన అంగటి చిన్నారావు గతేడాది నవంబరులో ఆకస్మాతుగా మృతి చెందడంతో మూడు నెలల పింఛన్ రూ.12వేలు భార్య లక్ష్మికి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శివప్రసాద్, నాయకులు మజ్జి వెంకటసత్యనారాయణ, వేంకటేశ్వరరెడ్డి, అడ్మిన్లు, సంక్షేమ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ 125 సంవత్సరాల వేడుక



సమాచార బుక్‌లెట్‌ను ప్రారంభించిన వాల్తేరు రైల్వే అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఏర్పాటై 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్ అధికారులు మంగళవారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

అక్కడి స్కూలు పిల్లలకు వ్యాస రచన, చిత్రలేఖనం, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. అలాగే స్టేషన్ భవనాన్ని అద్భుతమైన లైటింగ్‌తో అలకంరించారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లతో పాటు సర్క్యులేటింగ్ ఏరియాలో బ్యానర్లు, సమాచార బ్రోచర్లతో విస్తృత ప్రచారం చేశారు. పర్లాకిమిడిని నౌపడతో అనుసంధానం చేయాలని 1898లో మహారాజా గౌరచంద్ర గజపతి నారాచంద్ర ప్రతిపాదించగా 1900, ఏప్రిల్ ఒకటన నౌపడ, పర్లాకిమిడి మధ్య నేరో గేజ్ లైనును పర్లాకిమిడి లైట్ రైల్వే పేరుతో ప్రారంభించబడిందని రైల్వే అధికారులు తెలిపారు. దినదినాభివృద్ధి చెందుతూ ఈ లైను 1931లో గుణుపూర్ వరకు 51 కి.మీ మేర విస్తరించారని, ప్రస్తుతం నౌపడ-గుణుపూర్ లైనులో టెక్కలి, పెదసన, తెంబూరు, గంగువాడ, పాతపట్నం, పర్లాకిమిడి, కాశీనగర్, లిహారి, బన్సధార, పలాసింగి వంటి పది స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం రైల్వే సమాచారానికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించి పంపిణీ చేశారు.

వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో దానికి సంబంధించి పనులు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది.

ప్ర: పర్యాటక ప్రాజెక్టులకు సింగిల్ విండో అనుమతులు ఎప్పటి నుంచి ఇస్తారు?

జ: రెండు రోజుల క్రితమే సింగిల్ విండోకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తులను ప్రాసెస్ చేస్తాం.

ప్ర: భీమిలి మండలంలో పర్యాటక శాఖకు భూములిచ్చారా?

జ: శారదాపీఠం నుంచి వెనక్కి తీసుకున్న 15 ఎకరాలిస్తే పర్యాటక ప్రాజెక్టులు చేపడతామని ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్ర: బంగ్లాదేశ్ నౌకను రెస్టారెంట్‌గా మార్చేలా అనుమతులు వచ్చాయా?

జ: అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చింది. ఇటీవల విజయవాడలో సీఆర్‌జెడ్ సమావేశం జరిగింది. త్వరలోనే వారు కూడా అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

రోడ్డునపడ్డ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

చెన్నై, హైదరాబాద్‌లకు బదిలీ చేశారు. దాంతో రక్షణ కొరవడిందని ఆలస్యంగా గుర్తించి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) ద్వారా కొంతమందిని నియమించుకోవాలని యత్నిస్తున్నారు. వారికి లేఖ రాయడంతో స్టీల్ ప్లాంటులో పనిచేయడానికి ఆసక్తి కలిగిన కమాండెంట్లు పేర్లు ఇవ్వాలని ఆ సంస్థ మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఉన్న వారిని పంపించేసి కొత్త వారిని తెచ్చుకోవడం వెనుక అంతర్యం ఏమిటో చెప్పాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

కీలక సమావేశాల నిర్వహణకు ఫుల్‌స్టాప్

స్టీల్‌ప్లాంటులో ఏడాదికి రెండు సార్లు కీలక సమావేశాలు నిర్వహించి ఉద్యోగులలో స్ఫూర్తిని నింపి లక్ష్యం వైపు నడిపించడం ఆనవాయితీ. ప్రతి జనవరి 1, తేదీన, ఆర్థిక సంవత్సరం మొదటి తేదీ (ఏప్రిల్ 1)న డిప్యూటీ జనరల్ మేనేజర్ పైస్థాయి అధికారులతో సీఎండీ, డైరక్టర్లు ఉక్కు నగరం క్లబ్‌లో సమావేశమైన అప్పటివరకు ప్లాంటు సాధించిన ఉత్పత్తి, వచ్చిన లాభనష్టాలు, రాబోయే మూడు నెలలో చేయబోయే కీలక పనులు అన్నింటిపైనా చర్చిస్తారు. ఆ తరువాత వాటి వివరాలను ఆయా అధికారులు విభాగాల్లో సిబ్బందికి చెప్పి లక్ష్యం దిశగా పని చేయిస్తారు. అయితే ఈ సమావేశాలు ఏవీ గత ఏడాది నుంచి నిర్వహించడం లేదు. ముఖ్యంగా ఇన్‌చార్జి సీఎండీ అజయ్ సక్సేనా వచ్చినప్పటి నుంచి అధికారులతో ఏమీ చర్చించడం లేదు.

ఏప్రిల్ 1న (మంగళవారం) ఆయన విశాఖపట్నంలోనే లేకుండా వెళ్లిపోయారు. ఫిబ్రవరి 18న ఉక్కు వ్యవస్థాపక దినం. ఆ రోజున బాగా పనిచేసిన వారికి నెహ్రూ అవార్డులు ఇస్తుంటారు. ఈసారి అది కూడా చేయలేదు.

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (18521)కు ఏడాది పొడవునా తీవ్ర డిమాండ్ ఉంటోంది. డబుల్ డెక్కర్‌కు మొదటినుంచి ఆదరణ అంతంతమాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు), తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలకు) అనుకూలంగా లేకపోవడం, సుమారు 14 గంటలు కూర్చొని ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణికులు డబుల్ డెక్కర్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదు.

తిర్లుమల ఎక్స్‌ప్రెస్‌కు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతో పాటు స్లీపర్ క్లాసు కోచ్‌లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది. కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ బెర్తులు అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్నాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879), ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లకు మే నెలాఖరులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో ఒకటి, అరా బెర్తులు మినహా మిగిలినవి ఫుల్ అయిపోయాయి.

డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలుకు ఖాళీలు

వారానికి మూడు రోజులు అందుబాటులో ఉండే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయి. అలాగే ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతికి ఏప్రిల్ 28 వరకు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు (08583) బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైలు పట్టాలెక్కిన రోజు నుంచి పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కనీసం వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం విశాఖలో బయలుదేరి మన్మాడ్ మీదుగా నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లో కూడా మే నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి.

కనక మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన



మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బురుజుపేటలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన, స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల మొదటి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజల్లో భాగంగా లక్ష కుంకుమార్చన, స్వర్ణ పుష్పార్చన చేయడం ఆనవాయితీ. ఈమేరకు వేద పండితులు, అర్చకులు అమ్మవారికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోన్-5లో 85 శాతం పన్ను వసూలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-5లో ఆస్తి పన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. జోన్ పరిధిలో 1.06,000 అసెస్‌మెంట్ల ద్వారా రూ. 72.25 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.62.15 కోట్లు వసూలు చేశారు. ఈ సందర్భంగా జడ్సీ రాము విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకూ 85 శాతం ఆస్తి పన్ను వసూలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీపై రాయితీ వల్ల చాలా వరకూ ప్రయోజనం చేకూరిందని చెప్పారు.నీటి పన్నుకు సంబంధించి జోన్‌లో 52,278 అసెస్‌మెంట్లకు గాను రూ. 18 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ. 12 కోట్లు వసూలు చేశామన్నారు. పన్ను అధికంగా వసూలు చేసిన ఆర్ఐలు శ్రీనివాస్, విజయకుమారి, శ్రీనివాస్‌ను జడ్సీ అభినందించారు.

ఘనంగా ఒడిశా రాష్ట్రావతరణ దినోత్సవం



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఒడిశా వాసులు

మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దసపల్లా హిల్స్‌లో ఉన్న జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఒడిశా రాష్ట్రా వతరణ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆసంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ భాషా సంయుక్త రాష్ట్రాల అవతరణలో భాగంగా ఒడిశా 1936 ఏప్రిల్‌లో ఏర్పడిందన్నారు. అనంతరం ఒడిశాకు చెందిన రుచికరమైన పదార్థాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను శాఖాధికారి డాక్టర్ రాజేంద్ర కుమార్, తూర్పు కోస్తా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఒడిశాకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మధుమిత కృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయుర్వేద విభాగం ఆధ్వర్యంలో కాలం.. ఆరోగ్య సమస్యలు అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు జీర్ణక్రియను బలహీన పరుస్తాయని, రోగ నిరోధక శక్తిని తగ్గిస్తాయని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆకు కూరలు, కూరగాయలు. నేతితో కూడిన వంటకాలు, పప్పులు, తృణ ధాన్యాలు, తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీని ఆనుకుని ఫుట్‌పాత్‌లపై కానరాని పలకలు



డిగ్రీ కళాశాల రోడ్డులో దుస్థితి

ఆదమరిస్తే...అంతే సంగతులు!

» జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల ఫుట్‌పాత్‌లపై కానరాని పలకలు

» మ్యాన్‌హోల్‌లో పడి ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు, విద్యార్థులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని విశాఖ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు వినియోగించే ఫుట్‌పాత్‌లపై రాకపోకలు సాగించాలంటే విద్యార్థినులు, పాదచారులు హడలిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రాకపోకలు చేస్తుంటారు. ఇటీవల కాలంలో పలువురు ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్నారు. ఫుట్‌పాత్‌లపై పలకలు లేకపోవడంతో చాలామంది మ్యాన్‌హోల్‌లో పడి గాయపడుతున్నారు. మూగజీవులు సైతం ఇందులో పడిపోవడంతో వాటిని బయటకు తీసేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే రాత్రి వేళలో ఇటువైపు చీకటిగా ఉంటోంది. మ్యాన్‌హోల్‌లో చిన్నారులు పడితే పెనుప్రమాదానికి దారి తీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే వీటిపై పలకలు వేయాలని పలువురు కోరుతున్నారు.

24న భవన నిర్మాణ కార్మికుల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నా, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యా రని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ విమర్శించారు. మం గళవారం 98వ వార్డులో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక శాఖ వద్ద కార్మికుల క్లైమ్‌లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని టీడీపీ నాయ కులు హామీ ఇచ్చారని, కానీ నెలలు గడుస్తున్నా.. ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ విషయమై కార్మిక శాఖా మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేకపోవడంతో ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్ట రేట్ల వద్ద నిరసన తెలపాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ముద్దాడ వరప్రసాద్, ఎం. రామునాయుడు, నారాయణస్వామి, డివి రమణ, నరసింహులు, అప్పారావు, పాల్గొన్నారు.

ఉత్సవాలకు రావాలని మంత్రి 'ఆనం'కు ఆహ్వానం



మంత్రి ఆనంతో ఈవో సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 8న రాత్రి 10 గంటలకు జరగనున్న వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరు కల్యాణం, వైశాఖమాస శుక్లపక్ష తృతీయ అనగా ఈనెల 30న జరిగే స్వామివారి చందనోత్సవానికి రావాలని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈఓ కె. సుబ్బారావు ఆహ్వానించారు. మంగళవారం ఆయన విజయవాడ సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు ఐవీ రమణమూర్తి, వేద పండితులు సుబ్రహ్మణ్యశర్మ మంత్రిని వేద స్వస్తి వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం ఈఓ స్వామివారి శేషమాలికతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను మంత్రికి అందజేశారు.

వేగంగా టవర్ లైట్ల అమరిక

మురళీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలో జీవీఎంసీ కొత్తగా ఏర్పాటు చేస్తున్న హైఓల్టేజ్ విద్యుత్ టవర్ లైట్ల అమరిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ జంక్షన్ దాటాక ఎన్ఏడీ కొత్తరోడ్డు తర్వాత అంతటి కీలకమైన జంక్షన్లుగా ఉన్న ఆర్అండ్‌బీ, ఊర్వశి, తాటిచెట్లపాలెం, బిర్లా జంక్షన్ వద్ద 20 మీటర్ల పొడవున సరికొత్త విద్యుత్ లైట్లు అమరుస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆరంభమైన ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి. సోమవారం స్తంభాలను అమర్చారు. విద్యుత్ లైటింగ్ వైర్ల అనుసంధానం తర్వాత ఈనెలలోనే టవర్ లైట్లు ఆరంభించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్లు, పోలీస్ అధికారులు తెలిపారు.

అవినీతి జబ్బుకు ట్రీట్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

పత్రాలను ఇచ్చేందుకు పోలీసులతోపాటు మృతుడి కుటుంబ సభ్యులను ఆమె తన ఛాంబర్‌కు పిలిపించుకుంటున్నారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు ఎవరికీ రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నారు. అలాగే, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ప్యాక్ చేసేందుకు అవసరమైన కవర్, ఇతరత్రా సామగ్రిని మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో ఛాంబర్‌లోనే అందజేస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయి వెళ్లిపోయే ముందు మరోసారి సదరు కుటుంబ సభ్యులు ఆమె వద్దకు వెళ్లి డబ్బు లు అడిగిందీ, లేనిదీ చెప్పాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఈ మేరకు సంతకాలు కూడా తీసుకుంటున్నారు. విభాగాధిపతే ఈ ప్రక్రియ ను దగ్గరుండి పర్యవేక్షించడం, నేరుగా మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసు లతోనే మాట్లాడుతుండడంతో సిబ్బంది డబ్బులు అడిగేందుకు భయపడుతున్నారు. కవర్లు, ఇతర సామగ్రి విక్రయించే వ్యక్తులను కూడా మార్చురీ వద్ద లేకుండా చేశారు. దీనివల్ల ప్రక్రియ సాఫీగా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

రోజుకు పదికిపైగా...

ప్రతిరోజూ కేజీహెచ్‌లోని ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో పది నుంచి 12 వరకు పోస్టుమార్టాలు నిర్వహిస్తుంటారు. కనిష్ఠంగా ఐదు వేలు వేసుకున్నా రోజుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ వసూలు చేసేవారు. దీనికి విభాగాధిపతి డాక్టర్ కె.మమత చెక్ చెప్పారు. ఇప్పుడు మొత్తం ప్రక్రియ పూర్తయిన తరువాత కిందిస్థాయి సిబ్బంది వందో, రెండొందలో అడగడం తప్ప...ఇంత ఇవ్వాలని డిమాండ్ చేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. నిరుపేదలకు ఇబ్బందులు కలుగుతున్న విషయం తమ దృష్టికి రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు డాక్టర్ మమత తెలిపారు. ఎంతోమంది అప్పు చేసి మరీ ఇక్కడ సిబ్బందికి డబ్బులు ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, అందుకే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు ఆమె తెలిపారు.


పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం నేతలు

అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలి

» సీపీఎం నేత, కార్పొరేటర్ గంగారావు పిలుపు

మద్దిలపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని మధురైలో నిర్వహించే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, కార్పొరేటర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన మహాసభల పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధురైలో జరిగే మహాసభల్లో పేదలు, కార్మికుల సమస్యలపై చర్చించి రాబోయే మూడేళ్ల పార్టీ నిర్వహించాల్సిన పోరాటాలు రూపొందిస్తారన్నారు. సీపీఎం నాయకులు చలపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. అనంతరం జి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పద్మావతి, కె.కుమారి, కుమార్ మంగళం, అనపర్తి అప్పారావు త్రినాథ్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

» నేతల పిలుపు


మాట్లాడుతున్న సీపీఎం నేతలు

కంచరపాలెం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 2 నుంచి ఆరో తేదీ వరకు తమిళనాడులో జరగనున్న సీపీఎం అఖిలభారత 24వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనం వద్ద మంగళవారం పతాకావిష్కరణ చేశారు. సమసమాజ నిర్మాణమే సీపీఎం ధ్యేయమన్నారు. ప్రతి ఒక్కరికీ తిండి, ఉండేందుకు నివాశం, పని, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు సోషలిస్టు సమాజం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.జయలక్ష్మి,ఎస్.అప్పలరాజు, బి.పద్మతో పాటు ఒమ్మి అప్పారావు, ఈశ్వరరావు, శ్రావణ్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?


రోడ్డు విస్తరణకు నోచుకోక ఇరుకుగా ఉన్న వంతెన


వంతెన విస్తరణకు అడ్డంకిగా మారిన పైపులైన్లు

» విస్తరణకు నోచుకోని ఎంవీపీ ప్రధాన రహదారి
» తాగునీటి పైపులైన్లు మార్చాల్సి ఉండడంతో పనులు చేపట్టేందుకు వెనుకంజ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ బీచ్ రోడ్డుకు వెళ్లాలంటే ప్రధాన రహదారిని వినియోగిస్తున్నారు. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ బాగా పెరిగింది. ఎంవీపీ ప్రధాన రహదారిని రెండు లైన్లుగా విభజించాల్సి ఉంది. ఇది ఇప్పట్లో అయ్యేలా లేదు. మెడికవర్ ఆస్పత్రి నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ విశాలమైన రహదారి ఉంది. అయితే వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వెనుక ఉన్న ఈ దారిని కలిపేందుకు గెడ్డపై ఉన్న వంతెన కేవలం ఎనిమిది అడుగులు మాత్రమే ఉంది. దీనివల్ల వంతెనపై ఒక కారు వస్తే, ఎదురుగా మరో ఆటో కూడా తప్పుకోలేని పరిస్థితి. ఈ వంతెన విస్తరిస్తే తప్ప, ఈ రహదారి పూర్తిగా వినియోగంలోకి రాదు.

ప్రధాన పైపులైన్లు తొలగించాల్సిందే!

వంతెన ఆనుకుని గెడ్డపై గోదావరి నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లు ఉన్నాయి. వంతెన వెడల్పు చేయాలంటే పైపు లైన్లు తొలగించాలి. జీవీఎంసీ పద్దెనిమిదో వార్డు పరిధిలో ఉన్న ఈ సమస్యను తొలగించాల్సి ఉంటుంది. ఈ రహదారిని వెడల్పు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ కేవలం తాగు నీటి పైపు లైన్లు తొలగింపు ప్రక్రియ చేపట్టేందుకు వెనకడుగు వేసి, విస్తరణ ప్రతిపాదన అటకెక్కించారు.

వంతెన కింద నుంచి పైపు లైన్లు వెళ్లేలా డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే అటూ ఇటూ జరపడానికి వీలు లేదు. దీనికి నివాసాలు అడ్డు వస్తాయి. తాత్కాలికంగా పైపులైను మళ్లించడమో లేదా కింది నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటేనే వంతెన వెడల్పు చేయడానికి అవకాశం ఉంటుంది. వంతెన పూర్తయిన తర్వాత కింద భాగం నుంచి పైపు లైన్లు వెళ్లేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

ప్రధాన రహదారిలో రద్దీ తగ్గుతుంది

ఎంవీపీ అప్పుఘర్ వరకూ ప్రధాన రహదారిలో రద్దీ బాగా ఉంటోంది. ఇరువైపులా వ్యాపార సంస్థలు ఉండడం వల్ల రహదారిలో వాహనాల పార్కింగ్, ఆస్పత్రులు, రైతు బజార్ వంటి వాటికి వెళ్లే వాహనాలతో రద్దీ నిరంతరం ఉంటుంది. వంతెన విస్తరిస్తే నేరుగా ఎంవీపీ కాలనీ అప్పుఘర్ వరకూ వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ దారిలో ఇరువైపులా నివాసాలు మాత్రమే ఉండడం, రహదారి వెడల్పుగా ఉండడం వల్ల ప్రయాణం సులభమవుతుంది. పైగా రెండు రహదారులుగా డివైడర్ కూడా వేస్తే మరింత అందంగా రహదారి తయారవుతుంది. అధికారులు ఈ దిశగా ఆలోచించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా ఫించన్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం పంపిణీ చేశారు. కొత్త వెంకోజీపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేగి శోభకు డయాలిసిస్ పెన్షన్‌ను, జంపా కనకమ్మ, సూరిశెట్టి గౌరీలకు వితంతు పింఛన్లను అందజేశారు. అర్హులై ఉండి ఫించన్లు పొందలేని వారు ఎవరైనా ఉంటే తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే సూచించారు. పేదలందరికీ ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, అప్పారి గిరిబాబు, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఇతర నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


15వ వార్డులో కొత్త మంజూరైన వారికి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : బ్యాంకులకు వరుస సెలవు కావడంతో పింఛను వస్తుందో రాదోనన్న లబ్ధిదారుల సందేహాలను తోసిరాజని, మంగళవారం ఉదయమే యథావిధిగా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయడంతో నగదుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు అందించామని పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి తెలిపారు. ఠంచనుగా పింఛను ఇవ్వడంపై లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.


ఎంవీపీ కాలనీ : పింఛన్లు అందజేస్తున్న 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలేనికి చెందిన సత్యసాయి భక్తురాలు, స్వర్గీయ శరగడం వెంకయ్యమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయుడు శరగడం సుధాకర్ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షులు కర్రి వెంకట సూర్య అప్పారావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మజ్జిగను, ఆ తరువాత తాగునీటిని పంపిణీ చేయనున్నట్లు సుధాకర్ తెలిపారు. గత ఏడాది కూడా సుమారు రెండు నెలల పాటు ఈ మజ్జిగ పంపిణీ చేపట్టామని, ఈ ఏడాది కూడా రెండు నెలల పాటు చలివేంద్రం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి.రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు సుబ్బారావుకు నివాళి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలతో పాటు పారిశ్రామిక ప్రాంత ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాటాలు చేసిన ఘనత రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దివంగత సి.సుబ్బారావుకే దక్కుతుందని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. షీలానగర్‌లో మంగళవారం జరిగిన సుబ్బారావు వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాం బాబు, సత్యవతి, ఎ.లోకేశ్, వెంకటరెడ్డి, పీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో 106 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న 106 మంది ఉద్యోగులు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే వీఆర్ఎస్ ద్వారా చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా నెలకు కనీసం వందకు తక్కువ కాకుండా పదవీ విరమణలు జరుగుతున్నాయి.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిర్వహించనున్న బైక్ ర్యాలీ, హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, శోభాయాత్ర కన్వీనర్ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

» యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజనల్ అధికారి మాయా సుందరరాజన్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధనలకు అందించే వివిధ స్కాలర్‌షిప్‌లను భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజనల్ అధికారి మాయా సుందరరాజన్ పేర్కొన్నారు. ఏయూ సైన్స్ కళాశాల పరిధిలో ఫుల్ బ్రైట్ నెహ్రూ స్కాలర్‌షిప్‌తో పాటు వివిధ స్కాలర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మాయా సుందరరాజన్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నత విద్య, సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఈ స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్ 1946లో ప్రారంభమైందని, ప్రస్తుతం 160 దేశాల్లో ఇది అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ నాలుగు లక్షల మందికి ఈ స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో ఉన్నత విద్యను పొందే అవకాశం లభించిందన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధన జరపడానికి ఎంతో ఉపయోగంగా స్కాలర్‌షిప్‌లు నిలుస్తాయన్నారు.


మాట్లాడుతున్న మాయా సుందరరాజన్

ఈ స్కాలర్‌షిప్ సాధించిన వారు విదేశాల్లో పొందే వివిధ సదుపాయాలు, అవకాశాలు తెలియజేశారు. ఏ దేశంలో పరిశోధన చేయాలి అనే అంశంపై నిర్దిష్ట అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అమెరికన్ కార్నర్ కో-ఆర్డినేటర్ ఆచార్య పాల్ డగ్లస్, విభాగాధిపతులు ఆచార్యులు సంధ్యాదీపిక, జానకిరామ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారును తనిఖీ చేసిన స్పెషల్ సీఎస్


రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జేసీ తదితరులు

ఎంవీపీ కాలనీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీలోని రైతు బజార్‌ను ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. కూరగాయల ధరలు, రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులతో ప్రవర్తన తదితర అంశాలపై ఆయన రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రైతు బజారు అంతా కలియతిరిగి, పరిశుభ్రత, క్రమశిక్షణపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ వెంట జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు ఉన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణమా!

» సివిక్ ఎక్స్‌నోరా దసపల్లా హిల్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు


మద్యం షాపు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్న భవనం

రామ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ సివిక్ ఎక్స్‌నోరా దసపల్లా హిల్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. జీవీఎంసీ 28వ వార్డు పరిధి దసపల్లా హిల్స్‌లో మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని కోరుతూ మార్చి 5న జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా మార్చి 29న జీవీఎంసీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ మద్యం షాపును దసపల్లా హిల్స్‌లోని తూర్పు నావికాదళం ప్రధాన అధికారి నివాసం కార్యాలయం పక్కన, గవర్నర్ బంగ్లా ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న నివాస భవనంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ చుట్టు పక్కలా ప్రముఖుల నివాసాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా సమీపంలో సుమారు వంద మీటర్ల దూరంలో విశాఖ నగరంలో అత్యంత ప్రాచీనమైన సెయింట్ పాల్స్ చర్చి సైతం ఉందన్నారు. దేవాయాలు, ప్రార్థనా స్థలాలా సమీపంలో మద్యం షాపు నిర్వహణకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని వారు కోరారు.

లలితాపీఠంలో సీతాదేవిపై ప్రవచనాలు


ప్రవచనం వినిపిస్తున్న కనకమహాలక్ష్మి

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వసంత నవరాత్రుల సందర్భంగా లలితాపీఠంలో స్త్రీల రామాయణ పాటల ప్రసంగాల్లో భాగంగా మంగళవారం రాత్రి పాటల్లో సీతాదేవి అనే అంశంపై గాయత్రి కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి ప్రసంగించారు. సీత గడియ, సీతా రావణుల సంభాషణల, స్త్రీల వేవిళ్ళు తదితర పాటలు ఆలపించి జానపదుల విశ్వాసాలు, వారు సీతాదేవిని తమలో ఒకరిగా భావించుకోవడం, వారికి ఆమెపై గల ఆపేక్ష తదితర విషయాలను వివరించారు. ఇతర రామాయణాల్లో కంటే జానపద రామాయణాల ప్రత్యేకతను, స్త్రీల స్వభావాన్ని జానపద కవయిత్రులు భావించిన తీరును చక్కగా వివరించారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణ సేన్ ప్రవచనకర్తను సత్కరించారు.

విశ్వ బ్రాహ్మణులు ఐక్యతతో మెలగాలి

» జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండబాబు


కొండబాబుకి గానాల రాంమూర్తి స్మారకపురస్కారం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : విశ్వ బ్రాహ్మణులంతా ఐక్యంగా మెలగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర స్వర్ణకార సంఘం విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు పేర్కొన్నారు. ఉగాది నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక రవీంద్రనగర్‌లోనున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కీ.శే. గానాల రాంమూర్తి స్మారక పురస్కారాల కార్యక్రమంలో ఆయన గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. తన సేవలను గుర్తించి కీర్తిశేషులు నాగాల రామూర్తి స్మారక పురస్కారం అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ కన్వీనర్ గోడి నపరసింహాచారి, 39 వార్డు మాజీ కార్పొరేటర్ జనసేన నాయకుడు బోదలుపాటి ఉమామహేశ్వరారవు, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి గిడిజాల పార్వతీశం, కోశాదికారి ఎ.సత్య చంటి బాలు, విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు సురేష్, రవీంద్రనగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కానూరి శశికుమార్, కానూరి లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టు కానూరి వేణు తదతరులు పాల్గొన్నారు.

రహదారిపై ఆకర్షణగా పూల సోయగం


రహదారి మధ్యలో మొక్కలకు పూచిన పూలు

ఆరిలోవ : హనుమంతవాక జంక్షను నుంచి ఆరిలోవ వెళుతున్న రోడ్డులో జీవీఎంసీ వేసిన పూల మొక్కలు నిండి విరగబూశాయి. దీంతో ఆ ప్రాంతంలో వెళ్లే వారికి ఈ పూల చెట్లు ఆకట్టుకుంటున్నాయి. ఈ సీజన్‌లో ఈ పూలు పూస్తాయి. తెల్లని పూలతో చెట్టు నిండి పూసిన ఈ పూల మొక్కలు రహదారిలో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో చక్కని గాలికి పరిమళం వెదజల్లుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవాహనచోదకులు చక్కని వాతావరణాన్ని ఆహ్లాదిస్తూ ప్రయాణం చేస్తున్నారు.

16వ వార్డులో దుకాణాల తొలగింపు


బడ్డీలను తీసివేస్తున్న వ్యాపారులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో సులబ్ కాంప్లెక్సు ఎదురుగా స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న బడ్డీలను వెంటనే తొలగించాలని స్టీల్ ప్లాంట్ ఎస్టేట్ అధికారి జనార్ధన్ ఆదేశాల మేరకు మంగళవారం దుకాణదారులు స్వచ్ఛందంగా ఖాళీగా ఉన్న బడ్డీలను తొలగించారు. మిగిలిన వారు కూడా వెంటనే తమ బడ్డీలను తొలగించాలని లేకుంటే బందోబస్తుతో వచ్చి బడ్డీలను తీసేయడం జరుగుతుందని ఎస్టేట్ అధికారి హెచ్చరించారు. అయితే తమకు విద్యుత్ శాఖ వారు విద్యుత్ మీటర్లను కూడా మంజూరు చేశారని, నిజంగా బడ్డీలను తీయాలంటే ముందు విద్యుత్ శాఖ వారు మీటర్లను తీస్తే, తాము బడ్డీలను తీసివేస్తామని దుకాణదారులు చెబుతున్నారని ఎస్టేట్ అధికారి పేర్కొన్నారు. కాబట్టి విద్యుత్ శాఖ, జీవీఎంసీ అధికారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

13వ వార్డులో పింఛన్ల పంపిణీ

ఆరిలోవ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు పాత్కండి ధర్మారావు, కార్యదర్శి యల్లమల్లి సురేష్ మంగళవారం వార్డు పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ అందజేశారు. అలాగే 12వ వార్డులోని లీలా సుందరయ్యనగర్‌లో పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు

నీతమ్మధార, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఎండ ఎక్కువగా ఉంటుందని, పాదచారులు, వాహనదారులకు దహార్తిని తీర్చే విధంగా అన్ని ప్రాంతాల్లో ఎక్కువ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల భూలోకమాత అమ్మవారి ఆలయం వద్ద వార్డు బిజెపి నాయకుడు మజ్జి ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పరశురామ్‌రాజు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. తాను తన ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుకు కృషి చేస్తానని, అదే విధంగా పలువురు ముందుకు వచ్చి అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పరశురామ్‌రాజు కోరారు. కార్యక్రమంలో రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, క్రాంతినగర్ ప్రాంతాల గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా వరప్రసాద్ జన్మదిన వేడుకలు



వరప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

మురళీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ జన్మదిన వేడుకలను మంగళవారం వార్డులో ఘనంగా జరిపారు. సీనియర్ నాయకులు రామచంద్రరావు, పెంటకోట శ్రీనివాసరావు ఇతర ప్రధాన కార్యకర్తలు వరప్రసాద్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తుల్లో మరింత ఉన్నత స్థాయి పదవులు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. వార్డు సచివాలయాల సెక్రటరీలు, జీవీఎంసీలో పలు విభాగాల ఉద్యోగులు వరప్రసాద్‌ను కలిసి శాలువా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు ప్రగతికి వరప్రసాద్ సేవలు ఎంతో అవసరమని స్థానికులు, పార్టీ అభిమానులు పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీగౌరీ రామలింగేశ్వర ఆలయంలో పండితులు వరప్రసాద్ పేరిట ప్రత్యేక పూజాభిషేకాలు చేపట్టి ప్రసాదాలు అందించారు.

సరస్వతీ పార్కు ప్రవేశమార్గంలో కటౌట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డాబాగార్డెన్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ పార్కు స్థానికులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందిస్తోంది. అయితే, ఇటీవల కొన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇక్కడ ఫ్లెక్సీలు, కటౌట్ల కోసమే పెద్ద పెద్ద కర్రలు పెట్టి ఒక వైపు మార్గాన్ని మూసివేశారు. దీంతో ఈ సమస్యపై 'సరస్వతీ పార్కులోకి ప్రవేశం ఎలా?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 27న ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పార్కులోకి సందర్శకులు వెళ్లడానికి వీల్లేకుండా మూసి ఉన్న ద్వారాన్ని తెరిపించారు. మొత్తం కర్రలు తొలగించడంతో పాటు కటౌట్‌లకు సంబంధించి హోర్డింగ్‌కు ఉపయోగించే చార్డులను తొలగించారు.

దీంతో పార్కులోకి వెళ్లడానికి మార్గం సుగమమైంది. సమస్య పరిష్కారం కావడంతో సందర్శకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కటౌట్లు తొలగించడంతో ప్రవేశానికి అనువుగా మారిన స్థలం

డిప్లొమా కోర్సులతో విస్తృత ఉపాధి అకాశాలు

» ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణ

కంచరపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అనంతరం డిప్లొమా కోర్సుల్లో చేరితే త్వరితగతిన ఉపాధి లభించే అవకాశం ఉందని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీ రమణ పేర్కొన్నారు. మంగళవారంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన నేపథ్యంల ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శాంతినికేతన్ పాఠశాలలో మంగళవార నిర్వహించిన కార్యక్రమంలో 'పదో తరగతి అనంతరం డిప్లొమా కోర్సులపై అవగాహన కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో చేరితే చక్కని ఉపాధి వకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాలీసెట్‌లో ర్యాంకు పొందడం ద్వారా ఆసక్తి ఉన్న బ్రాంచిల్లో చేరవచ్చన్నారు. కెమికల్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు పొందిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఈదుల శ్రీనివాస్, సిబ్బంది శ్రీరెడ్డి, లాల్, స్వాతి, సరస్వతి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీ రమణ

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



రైల్వే న్యూ కాలనీలోని కేంద్రం నుంచి పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు ముగిశాయి. గత నెల 17న ప్రారంభమైన పది పరీక్షలు మంగళవారం సోషల్ పరీక్షతో ముగిశాయి. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, లలితా నగర్, రైల్వే న్యూ కాలనీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటలకు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల్లోకి పంపించి వారు పరీక్ష రాసి తిరిగి వచ్చే వరకు బయటే తల్లిదండ్రులు వేచి ఉండేవారు. ఈ పరీక్షలన్నీ కూడా చాలా బాగా రాశామని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆనందంగా తెలిపారు. ఎన్జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శతశాతం విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ మాణిక్యం తెలిపారు. ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల కోసం ఇన్నాళ్లూ పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులకు ఇక ఆటవిడుపు లభించిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

మాధవధారలో..

మాధవధార, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మార్చి 17న ఆరంభమైన పరీక్షల్లో 7 పేపర్లు చొప్పున విద్యార్థులు మాధవధార, మురళీనగర్ కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారు. జీవీఎంసీ 50వ వార్డు మాధవధార హైస్కూలు, 49వ వార్డు బర్మా క్యాంప్ కె.కాలనీ జీవీఎంసీ హైస్కూలు సహా ఈ ప్రాంతలోని పలు ప్రైవేటు బడుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ పదవ తరగతి పరీక్షల సమయంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, విద్యార్థుల డిబార్, మాస్ కాపీయింగ్ లేకుండా విజయవంతంగా ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ వీరారావు బుజ్జి

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 27వ వార్డులోని పలు ప్రాంతాల్లోని సచివాలయాల పరిధిలో అడ్మిన్లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం పింఛన్లను కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు గొలగాని వీరారావు బుజ్జి పంపిణీ చేశారు. ఇందులో భాగంగా దొండపర్తి ప్రాంతంలో ఇద్దరు వితంతువులకు స్పౌస్ పింఛన్లను కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో నూతనంగా స్పౌస్ పింఛన్‌ను ప్రభుత్వం అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

భర్తకు వస్తున్న పింఛన్‌ను ఆయన మృతి చెందడం వల్ల భార్య రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఆ పింఛన్‌ను మృతుడి భార్యకు తక్షణమే అందించడం హర్షించదగ్గ నిర్ణయమన్నారు. కుమ్మరి వీధికి చెందిన అంగటి చిన్నారావు గతేడాది నవంబరులో ఆకస్మాతుగా మృతి చెందడంతో మూడు నెలల పింఛన్ రూ.12వేలు భార్య లక్ష్మికి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శివప్రసాద్, నాయకులు మజ్జి వెంకటసత్యనారాయణ, వేంకటేశ్వరరెడ్డి, అడ్మిన్లు, సంక్షేమ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ 125 సంవత్సరాల వేడుక



సమాచార బుక్‌లెట్‌ను ప్రారంభించిన వాల్తేరు రైల్వే అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఏర్పాటై 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్ అధికారులు మంగళవారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

అక్కడి స్కూలు పిల్లలకు వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే స్టేషన్ భవనాన్ని అద్భుతమైన లైటింగ్‌తో అలకంరించారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లతో పాటు సర్క్యులేటింగ్ ఏరియాలో బ్యానర్లు, సమాచార బ్రోచర్లతో విస్తృత ప్రచారం చేశారు. పర్లాకిమిడిని నౌపడతో అనుసంధానం చేయాలని 1898లో మహారాజా గౌరచంద్ర గజపతి నారాచంద్ర ప్రతిపాదించగా 1900, ఏప్రిల్ ఒకటన నౌపడ, పర్లాకిమిడి మధ్య నేరో గేజ్ లైనును పర్లాకిమిడి లైట్ రైల్వే పేరుతో ప్రారంభించబడిందని రైల్వే అధికారులు తెలిపారు. దినదినాభివృద్ధి చెందుతూ ఈ లైను 1931లో గుణుపూర్ వరకు 51 కి.మీ మేర విస్తరించారని, ప్రస్తుతం నౌపడ-గుణుపూర్ లైనులో టెక్కలి, పెదసన, తెంబూరు, గంగువాడ, పాతపట్నం, పర్లాకిమిడి, కాశీనగర్, లిహురి, బన్సధార, పలాసింగి వంటి పది స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం రైల్వే సమాచారానికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించి పంపిణీ చేశారు.

వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో దానికి సంబంధించి పనులు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది.

ప్ర: పర్యాటక ప్రాజెక్టులకు సింగిల్ విండో అనుమతులు ఎప్పటి నుంచి ఇస్తారు?

జ: రెండు రోజుల క్రితమే సింగిల్ విండోకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తులను ప్రాసెస్ చేస్తాం.

ప్ర: భీమిలి మండలంలో పర్యాటక శాఖకు భూములిచ్చారా?

జ: శారదాపీఠం నుంచి వెనక్కి తీసుకున్న 15 ఎకరాలిస్తే పర్యాటక ప్రాజెక్టులు చేపడతామని ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్ర: బంగ్లాదేశ్ నౌకను రెస్టారెంట్‌గా మార్చేలా అనుమతులు వచ్చాయా?

జ: అటవీ శాఖ నుంచి అనుమతి వచ్చింది. ఇటీవల విజయవాడలో సీఆర్‌జెడ్ సమావేశం జరిగింది. త్వరలోనే వారు కూడా అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

రోడ్డునపడ్డ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

చెన్నై, హైదరాబాద్‌లకు బదిలీ చేశారు. దాంతో రక్షణ కొరవడిందని ఆలస్యంగా గుర్తించి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) ద్వారా కొంతమందిని నియమించుకోవాలని యత్నిస్తున్నారు. వారికి లేఖ రాయడంతో స్టీల్ ప్లాంటులో పనిచేయడానికి ఆసక్తి కలిగిన కమాండెంట్లు పేర్లు ఇవ్వాలని ఆ సంస్థ మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఉన్న వారిని పంపించేసి కొత్త వారిని తెచ్చుకోవడం వెనుక అంతర్యం ఏమిటో చెప్పాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

కీలక సమావేశాల నిర్వహణకు ఫుల్‌స్టాప్

స్టీల్‌ప్లాంటులో ఏడాదికి రెండు సార్లు కీలక సమావేశాలు నిర్వహించి ఉద్యోగులలో స్ఫూర్తిని నింపి లక్ష్యం వైపు నడిపించడం ఆనవాయితీ. ప్రతి జనవరి 1, తేదీన, ఆర్థిక సంవత్సరం మొదటి తేదీ (ఏప్రిల్ 1)న డిప్యూటీ జనరల్ మేనేజర్ పైస్థాయి అధికారులతో సీఎండీ, డైరక్టర్లు ఉక్కు నగరం క్లబ్‌లో సమావేశమైన అప్పటివరకు ప్లాంటు సాధించిన ఉత్పత్తి, వచ్చిన లాభనష్టాలు, రాబోయే మూడు నెలలో చేయబోయే కీలక పనులు అన్నింటిపైనా చర్చిస్తారు. ఆ తరువాత వాటి వివరాలను ఆయా అధికారులు విభాగాల్లో సిబ్బందికి చెప్పి లక్ష్యం దిశగా పని చేయిస్తారు. అయితే ఈ సమావేశాలు ఏపీ గత ఏడాది నుంచి నిర్వహించడం లేదు. ముఖ్యంగా ఇన్‌చార్జి సీఎండీ అజయ్ సక్సేనా వచ్చినప్పటి నుంచి అధికారులతో ఏమీ చర్చించడం లేదు.

ఏప్రిల్ 1న (మంగళవారం) ఆయన విశాఖపట్నంలోనే లేకుండా వెళ్లిపోయారు. ఫిబ్రవరి 18న ఉక్కు వ్యవస్థాపక దినం. ఆ రోజున బాగా పనిచేసిన వారికి నెహ్రూ అవార్డులు ఇస్తుంటారు. ఈసారి అది కూడా చేయలేదు.

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్ (18521)కు ఏడాది పొడవునా తీవ్ర డిమాండ్ ఉంటోంది. డబుల్ డెక్కర్‌కు మొదటినుంచి ఆదరణ అంతంతమాత్రంగానే ఉంది. ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరే సమయం (రాత్రి 11 గంటలకు), తిరుపతి చేరే సమయం (మధ్యాహ్నం 12.30 గంటలకు) అనుకూలంగా లేకపోవడం, సుమారు 14 గంటలు కూర్చొని ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణికులు డబుల్ డెక్కర్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతో పాటు స్లీపర్ క్లాసు కోచ్‌లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది. కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ బెర్తులు అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్నాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

విశాఖ మీదుగా భువనేశ్వర్ నుంచి తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం అందుబాటులో ఉండే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879), ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లకు మే నెలాఖరులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో ఒకటి, అరా బెర్తులు మినహా మిగిలినవి ఫుల్ అయిపోయాయి.

డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలుకు ఖాళీలు

వారానికి మూడు రోజులు అందుబాటులో ఉండే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయి. అలాగే ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతికి ఏప్రిల్ 28 వరకు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు (08583) బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ఈ రైలు పట్టాలెక్కిన రోజు నుంచి పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కనీసం వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం విశాఖలో బయలుదేరి మన్మాడ్ మీదుగా నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లో కూడా మే నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి.

కనక మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన



మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బురుజుపేటలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన, స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల మొదటి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజల్లో భాగంగా లక్ష కుంకుమార్చన, స్వర్ణ పుష్పార్చన చేయడం ఆనవాయితీ. ఈమేరకు వేద పండితులు, అర్చకులు అమ్మవారికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోన్-5లో 85 శాతం పన్ను వసూలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-5లో ఆస్తి పన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. జోన్ పరిధిలో 1,06,000 అసెస్‌మెంట్లు ద్వారా రూ. 72.25 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.62.15 కోట్లు వసూలు చేశారు. ఈ సందర్భంగా జడ్సీ రాము విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకూ 85 శాతం ఆస్తి పన్ను వసూలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీపై రాయితీ వల్ల చాలా వరకూ ప్రయోజనం చేకూరిందని చెప్పారు.నీటి పన్నుకు సంబంధించి జోన్‌లో 52,278 అసెస్‌మెంట్లకు గాను రూ. 18 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ. 12 కోట్లు వసూలు చేశామన్నారు. పన్ను అధికంగా వసూలు చేసిన ఆర్ఐలు శ్రీనివాస్, విజయకుమారి, శ్రీనివాస్‌ను జడ్సీ అభినందించారు.

ఘనంగా ఒడిశా రాష్ట్రావతరణ దినోత్సవం



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఒడిశా వాసులు

మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దసపల్లా హిల్స్‌లో ఉన్న జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఒడిశా రాష్ట్రా వతరణ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆసంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ భాషా సంయుక్త రాష్ట్రాల అవతరణలో భాగంగా ఒడిశా 1936 ఏప్రిల్‌లో ఏర్పడిందన్నారు. అనంతరం ఒడిశాకు చెందిన రుచికరమైన పదార్థాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను శాఖాధికారి డాక్టర్ రాజేంద్ర కుమార్, తూర్పు కోస్తా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఒడిశాకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మధుమిత కృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయుర్వేద విభాగం ఆధ్వర్యంలో కాలం.. ఆరోగ్య సమస్యలు అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు జీర్ణక్రియను బలహీన పరుస్తాయని, రోగ నిరోధక శక్తిని తగ్గిస్తాయని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆకు కూరలు, కూరగాయలు. నేతితో కూడిన వంటకాలు, పప్పులు, తృణ ధాన్యాలు, తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీని ఆనుకుని ఫుట్‌పాత్‌లపై కానరాని పలకలు



డిగ్రీ కళాశాల రోడ్డులో దుస్థితి

ఆదమరిస్తే...అంతే సంగతులు!

» జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల ఫుట్‌పాత్‌లపై కానరాని పలకలు

» మ్యాన్‌హోల్‌లో పడి ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు, విద్యార్థులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని విశాఖ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు వినియోగించే ఫుట్‌పాత్‌లపై రాకపోకలు సాగించాలంటే విద్యార్థినులు, పాదచారులు హడలిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రాకపోకలు చేస్తుంటారు. ఇటీవల కాలంలో పలువురు ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్నారు. ఫుట్‌పాత్‌లపై పలకలు లేకపోవడంతో చాలామంది మ్యాన్‌హోల్‌లో పడి గాయపడుతున్నారు. మూగజీవులు సైతం ఇందులో పడిపోవడంతో వాటిని బయటకు తీసేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే రాత్రి వేళలో ఇటువైపు చీకటిగా ఉంటోంది. మ్యాన్‌హోల్‌లో చిన్నారులు పడితే పెనుప్రమాదానికి దారి తీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే వీటిపై పలకలు వేయాలని పలువురు కోరుతున్నారు.

24న భవన నిర్మాణ కార్మికుల నిరసన

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నా, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యా రని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ విమర్శించారు. మంగళవారం 98వ వార్డులో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక శాఖ వద్ద కార్మికుల క్లైమ్‌లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని టీడీపీ నాయ కులు హామీ ఇచ్చారని, కానీ నెలలు గడుస్తున్నా.. ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ విషయమై కార్మిక శాఖా మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేకపోవడంతో ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్ట రేట్ల వద్ద నిరసన తెలపాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ముద్దాడ వరప్రసాద్, ఎం. రామునాయుడు, నారాయణస్వామి, డివి రమణ, నరసింహులు, అప్పారావు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ

ఉత్సవాలకు రావాలని మంత్రి 'ఆనం'కు ఆహ్వానం



మంత్రి ఆనంతో ఈవో సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 8న రాత్రి 10 గంటలకు జరగనున్న వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరు కల్యాణం, వైశాఖమాస శుక్లపక్ష తృతీయ అనగా ఈనెల 30న జరిగే స్వామివారి చందనోత్సవానికి రావాలని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈఓ కె. సుబ్బారావు ఆహ్వానించారు. మంగళవారం ఆయన విజయవాడ సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు ఐవీ రమణమూర్తి, వేద పండితులు సుబ్రహ్మణ్యశర్మ మంత్రిని వేద స్వస్తి వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం ఈఓ స్వామివారి శేషమాలికతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను మంత్రికి అందజేశారు.

వేగంగా టవర్ లైట్ల అమరిక

మురళీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలో జీవీఎంసీ కొత్తగా ఏర్పాటు చేస్తున్న హైటల్టేజ్ విద్యుత్ టవర్ లైట్ల అమరిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ జంక్షన్ దాటాక ఎన్ఏడీ కొత్తరోడ్డు తర్వాత అంతటి కీలకమైన జంక్షన్లుగా ఉన్న ఆర్అండ్‌బీ, ఊర్వశి, తాటిచెట్లపాలెం, బిర్లా జంక్షన్ వద్ద 20 మీటర్ల పొడవున సరికొత్త విద్యుత్ లైట్లు అమరుస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆరంభమైన ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి. సోమవారం స్తంభాలను అమర్చారు. విద్యుత్ లైటింగ్ వైర్ల అనుసంధానం తర్వాత ఈనెలలోనే టవర్ లైట్లు ఆరంభించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్లు, పోలీస్ అధికారులు తెలిపారు.

అవినీతి జబ్బుకు ట్రీట్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

పత్రాలను ఇచ్చేందుకు పోలీసులతోపాటు మృతుడి కుటుంబ సభ్యులను ఆమె తన ఛాంబర్‌కు పిలిపించుకుంటున్నారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు ఎవరికీ రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నారు. అలాగే, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ప్యాక్ చేసేందుకు అవసరమైన కవర్, ఇతరత్రా సామగ్రిని మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో ఛాంబర్‌లోనే అందజేస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయి వెళ్లిపోయే ముందు మరోసారి సదరు కుటుంబ సభ్యులు ఆమె వద్దకు వెళ్లి డబ్బు లు అడిగిందీ, లేనిదీ చెప్పాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఈ మేరకు సంతకాలు కూడా తీసుకుంటున్నారు. విభాగాధిపతే ఈ ప్రక్రియ ను దగ్గరుండి పర్యవేక్షించడం, నేరుగా మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసు లతోనే మాట్లాడుతుండడంతో సిబ్బంది డబ్బులు అడిగేందుకు భయపడుతున్నారు. కవర్లు, ఇతర సామగ్రి విక్రయించే వ్యక్తులను కూడా మార్చురీ వద్ద లేకుండా చేశారు. దీనివల్ల ప్రక్రియ సాఫీగా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

రోజుకు పదికిపైగా...

ప్రతిరోజూ కేజీహెచ్‌లోని ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో పది నుంచి 12 వరకు పోస్టుమార్టాలు నిర్వహిస్తుంటారు. కనిష్ఠంగా ఐదు వేలు వేసుకున్నా రోజుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ వసూలు చేసేవారు. దీనికి విభాగాధిపతి డాక్టర్ కె.మమత చెక్ చెప్పారు. ఇప్పుడు మొత్తం ప్రక్రియ పూర్తయిన తరువాత కిందిస్థాయి సిబ్బంది వందో, రెండొందలో అడగడం తప్ప...ఇంత ఇవ్వాలని డిమాండ్ చేయడం లేదని పలువురు పేర్కొంటున్నారు. నిరుపేదలకు ఇబ్బందులు కలుగుతున్న విషయం తమ దృష్టికి రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు డాక్టర్ మమత తెలిపారు. ఎంతోమంది అప్పు చేసి మరీ ఇక్కడ సిబ్బందికి డబ్బులు ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, అందుకే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు ఆమె తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అదానీ గంగవరం పోర్టులో లోకో మోటివ్‌లు ప్రారంభం

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో కొత్తగా రెండు లోకో మోటివ్‌లను మంగళవారం ప్రారంభించారు. వీటి ద్వారా పోర్టు సామర్థ్యం, ఉత్పాదకతను పెంచే ప్రయత్నాల్లో గణనీయమైన ముందడుగు పడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ లోకో మోటివ్‌లతో వేగవంతమైన, సమర్థవంతమైన కార్గో సేవలు అందుతాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

పెందుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని సర్వే నంబర్-113లో గల ప్రభుత్వ స్థలంలో తప్పుడు పత్రాలతో పది సెంట్లు ఆక్రమించి కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేశ్ మంగళవారం తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే సర్వే నంబర్‌లో ఆక్రమణను రెవెన్యూ అధికారులు కూల్చివేయగా, ఇప్పుడు అధికార పార్టీ నాయకుల అండదండలతో నిర్మాణం జరుగుతుందని తహశీల్దార్‌కు వివరించారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

పెందుర్తి, ఏప్రిల్ 1 ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురంలో జడ్పీటీసీ నిధులు పన్నెండు లక్షల రూపాయలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు మంగళవారం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ


మహిళకు సరకులు అందజేస్తున్న దృశ్యం

అగనంపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దిబ్బపాలెం, దానబోయినపాలెం ప్రాంతాల్లోని పలువురి పేదలకు సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు ఆర్థిక సాయంతో మంగళవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, మస్తాన్‌రెడ్డి, ఎస్.గోవిందరావు, హనుమంతరావు, ఎల్.రాము, గణేశ్, ఈశ్వరరావు, పి.శ్రీనివాస్, తదితరులు పాలొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీలీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, మునక్కాడలు (కిలో) 30, బద్దచిక్కుడు 54, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సజావుగా పింఛన్ల పంపిణీ

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 72వ వార్డులో మంగళవారం ఆయన సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేస్తుందని, రాష్ట్ర ప్రగతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ శేషాద్రి, టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, నారాయణ ప్రసాద్, విజయసాయి, గౌరీశంకర్, సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిరాజుపాలెంలో లబ్ధిదారునికి ఫించన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పి.గణబాబు


95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో మహిళకు పెన్షన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


పింఛన్ పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

పెందుర్తి: రాష్ట్ర ఖజానా లోటులో ఉన్నా ప్రతినెలా ఒకటో తేదీకల్లా ప్రభుత్వం సామాజిక ఫించన్ల పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో లబ్ధిదారులకు ఆయన పెన్షన్లను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ హేమావతి, నాయకులు పిన్నింటి పార్వతి, పిళ్లా జగన్మోహనపాత్రుడు, గొర్లె అప్పారావు, రోమాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం, జయప్రకాశ్‌నగర్, లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల్లోని లబ్ధిదారులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఫించన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ కె.హైమావతి, గణబాబు తనయుడు మౌర్యసింహ, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు నరవ అనూష, శివాజీ, మళ్ల అప్పారావు, సీహో ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారులకు ఆయన నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కేఎస్ఎన్ రెడ్డి నగర్‌లో టీడీపీ మహిళా విభాగం వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.

గోపాలపట్నం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పలువురు లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో ఇటీవల భర్తను కోల్పోయిన కంబాల అచ్చియ్యమ్మకు కొత్తగా మంజూరైన పింఛన్‌ను టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారావు, సూరిబాబు, సచివాలయ సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్..దుర్వాసన!

» ప్రజలు ఉక్కిరిబిక్కిరి

అపరాధ రుసుము విధించినా తీరు మార్చుకోని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం

» కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు

మల్కాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) నుంచి ప్రతిరోజు ఘాటైన దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ పెద్దమొత్తంలో అపరాధ రుసుము విధించినా రిఫైనరీ అధికారుల్లో కించిత్తు మార్పు కూడా కనిపించడం లేదు. విచ్చలవిడిగా కాలుష్యాన్ని విడిచిపెడుతూ ప్రజలకు రోగాలు పంచిపెడుతున్నారు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో హెచ్‌పీసీఎల్ విచ్చలవిడితనం పెరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపట్టిన తరువాత నూతనంగా ప్రారంభమైన యూనిట్ల నుంచే పెద్దఎత్తున ఈ దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా ఐఎస్ఎస్ కల్యాణి ఆస్పత్రి నుంచి శ్రీహరిపురం వరకు ఈ దుర్వాసన వెదజల్లుతోంది. గాలి ఎక్కువగా వీచినప్పుడు మిగతా ప్రాంతాలకూ ఈ దుర్వాసన విస్తరిస్తుంది. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లేవారు ఈ దుర్వాసనను భరించలేకపోతున్నారు. ఈ మార్గం గుండా నడవాలంటేనే అందరూ హడలిపోతున్నారు. ఈ దుర్వాసన వల్ల అనేక మంది శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారు. గొంతులో, కడుపులోనూ మంటగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు హెచ్‌పీసీఎల్ కాలుష్యంపై మల్కాపురంలోనే ఓ సమావేశం ఏర్పాటు చేస్తే తమ చేదు అనుభవాలు మరిన్ని బయటపెడతామని స్థానికులు పేర్కొంటున్నారు.


హెచ్‌పీసీఎల్ క్రూడ్ యూనిట్

చెత్తాచెదారంతో నిండిన గెడ్డలు

దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికుల ఆవేదన


వ్యర్థాలతో నిండిన వికాస్‌నగర్ గెడ్డ

పెదగంట్యాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని పలు గెడ్డలు నిర్వహణా లోపంతో చెత్తాచెదారంతో నిండిపోగా, మరికొన్ని గెడ్డలు అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరాయి. దీంతో స్థానికులకు ఎప్పటికప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త గాజువాక నుంచి భానోజీతోట, ప్రియదర్శనీ కాలనీ, వికాస్‌నగర్ ప్రాంతాల నుంచి మురుగు నీటిని దిగువకు తరలించే గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ కవర్లతో పాటు ఇతర వ్యర్థాలు వికాస్‌నగర్ బిడ్జి వద్ద పెద్దఎత్తున తిష్ఠ వేశాయి. దీంతో మురుగు నీరు సాఫీగా దిగువకు పారడం లేదు. వారాల తరబడి ఇక్కడ మురుగు నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాగే సంజీవగిరి కాలనీ, కొత్తదిబ్బపాలెం, యాతపాలెం, ఆటోనగర్ ప్రాంతాల నుంచి దిగువకు మురుగు నీరు తరలించే గెడ్డకు వాల్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో గెడ్డకు ఇరువైపులా మట్టి అంచులు ఎప్పడికప్పుడు కూలిపోతున్నాయి. దీనికితోడు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు బాగా పెరిగిపోయాయి. ఏ మాత్రం వానొచ్చినా గెడ్డ నుంచి నీరు దిగువకు సాఫీగా పారడం లేదు. అందువల్ల గెడ్డకు రెండుపక్కలా సీసీ గట్లను ఏర్పాటు చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు జీవీఎంసీ, ఐలా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వికాస్‌నగర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను కూడా తొలగించాలని కోరుతున్నారు.


అభివృద్ధికి నోచుకోని ఆటోనగర్ గెడ్డ


అవిరెడ్డి సూర్యనారాయణను సత్కరిస్తున్న గ్రామస్థులు

ఆలయ అభివృద్ధి ప్రదాతకు సత్కారం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో త్రిశక్తి ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆలయ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణను గ్రామస్థులు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సత్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. తొలుత త్రిశక్తి అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వాసుస్వామి, బి.అప్పలరాజు, సిరసపల్లి బాబూరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు సుబ్బారావుకు నివాళి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలతో పాటు పారిశ్రామిక ప్రాంత ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాటాలు చేసిన ఘనత రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దివంగత సి.సుబ్బారావుకే దక్కుతుందని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. షీలానగర్‌లో మంగళవారం జరిగిన సుబ్బారావు వర్థంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, సత్యవతి, ఎ.లోకేశ్, వెంకటరెడ్డి, పీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో 106 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న 106 మంది ఉద్యోగులు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే వీఆర్ఎస్ ద్వారా చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా నెలకు కనీసం వందకు తక్కువ కాకుండా పదవీ విరమణలు జరుగుతున్నాయి.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్ర మాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు.


ప్రహ్లాదపురం చెరువు పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న వాకింగ్ ట్రాక్

చురుగ్గా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

వేపగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం నూకాలమ్మ ఆలయాన్ని ఆనుకుని ఉన్న చెరువు పరిసరాల్లో చేపట్టిన వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడి పార్కులో సుమారు 250 మీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు ప్రతి ఐదు మీటర్ల దూరంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ నిధులు రూ.40 లక్షలను వెచ్చించనున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తయితే ఉదయం, సాయంత్రం వేళల్లో తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ లక్ష్యం



పేదలకు మందులు పంపిణీ చేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ ప్రసాద్ తదితరులు

కూర్మన్నపాలెం,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా లయన్స్ క్లబ్ సేవలు అందిస్తుందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలో ఏ ప్లస్ ఆస్పత్రి ప్రాంగణంలో కూర్మన్నపాలెం శాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి, సుబ్బరాజుల పర్యవేక్షణలో మంగళవారం వీబీఆర్ లయన్స్ జీవనధార ఫార్మసీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు మందులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎ.సూర్యనారాయణ, కేవీ ప్రసాద్, ప్రసాదనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


70వ వార్డు శ్రీనివాసనగర్-7లో రోడ్డుపై పారుతున్న తాగునీరు. (ఇన్‌సెట్లో) పైపు లైన్ లీక్ అవుతున్న దృశ్యం

వృథాగా పోతున్న తాగునీరు

అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆవేదన

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్ రోడ్డు 7లో, ఎల్‌వీ నగర్-3లో పైపు లైన్లు లీక్ అవుతుండడంతో తాగునీరు వృథాగా పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపు లైన్లకు లేకేజీ కారణంగా సరిపడినంత కొళాయిల నుంచి సజావుగా నీరందక ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పైపు లైన్ల లీకేజీల కారణంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు కాలనీవాసులు చెబుతున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకునైనా అధికారులు స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరంతరాయంగా వెలుగుతున్న వీధి లైట్లు

సిబ్బంది పర్యవేక్షణా లోపమే కారణమంటున్న ప్రజలు




అగనంపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు, పార్మాసిటీ పునరావాస కాలనీలతో పాటు వినాయకనగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో వీధి లైట్లు పగలే వెలుగులు విరజిమ్ముతున్నాయి. వీధి దీపాల నిర్వహణను పట్టించుకునే నాథులే కరువవ్వడంతో ఈ పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాలో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా సంబంధిత సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అందువల్ల ఉన్నాతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నిర్వహించనున్న బైక్ ర్యాలీ, హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న గాజువాక వంటిళ్ల జంక్షన్ వద్ద వెయ్యి ద్విచక్ర వాహనాలు, వంద కార్లతో బైక్ ర్యాలీ, హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. గాజువాక, మింది, బీహెచ్‌పీవీ, షీలానగర్, ఎన్ఏడీ, మద్దిలపాలెం మీదుగా బీచ్ రోడ్డు వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, శోభాయాత్ర కన్వీనర్ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సత్కారం


చేనేత కార్మికులు, సంఘం నూతన సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెదమడక పద్మమార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులతో పాటు సంఘం నూతనంగా సభ్యత్వం పొందిన పలువురిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి పప్పు రాజారావు మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాలకు పలువురు ముందుకు రావాడం అభినందనీయమన్నారు. సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, భాస్కర సత్యప్రసాద్, నాగేశ్వరరావు, వి.జగ్గారావు, వీర హనుమంతరావు, వెంకటరమణ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎం సభలను విజయవంతం చేయాలి'

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రజా సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేస్తూ విజయం సాధిస్తున్న ఘనత సీపీఎంకు మాత్రమే దక్కుతుందని సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ నాయకుడు సనపల జగన్నాథరావు అన్నారు. మంగళవారం భెల్ హెచ్‌పీవీపీ గేటు ఎదురుగా జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశాన్ని ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం మదురైలో ఈ నెలలో జరగనున్న సీపీఎం జాతీయ మహాసభల్లో ప్రజా సమస్యలపై అనేక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సభలను కార్మికులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జీటీపి ప్రకాశ్, కె.నారపరెడ్డి, సీతన్‌నాయుడు, కొల్లి దేముడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR DIVISION CIVIL JUDGE AT GAJUWAKA

I.P No 01/2025

Between:
Kandrapu Raja Reddy ...Petitioner
And:
Eluri Srinivasa Rao & 8 others ... Respondents

PUBLIC NOTICE

To, 1. Eluri Srinivasa Rao, S/o Venkata rao, D.No. 44-31-81/36/1, Laxminagar, Kailasapuram, Visakhapatnam-13
2. Gidijala Anoop Kumar, S/o Sanyasi, D.No.-8-76/3, Vepagunta, Varalakshminagar, Cheemalapalle, Visakhapatnam-13
3. Yamalapalli Ganesh, S/o Srinivas, D.No. 41-6-12/633/7, Railway New colony, Waltair RS, Visakhapatnam Urban - 530004.
4. Maddula Naveen Kumar, S/o Anandh Kumar, D.No-47-10-50, above Union Bank, 4th lane, Dwarakanagar, Visakhapatnam-16.
5. Thota Murali K Mondi Tirumala Satish Kumar, S/o Kiran Kumar Raja Rao, D. No - 44-5-29, Beside-Sri vasavi Vindu, Cattering, Golden Beauty Parlour, Thatichetlapalem, Visakhapatnam-16.
6. Guthurthi Sanyasi, S/o Prasad, D.No.42/27/3, Town Kotha Road, Near Purna Market, Visakhapatnam-530 001.
7. Laveti Sree ramulu, S/o Appanna, D.No-13-7-7, SBR JEWELLERS, and Wholesaler, Opp: Srinivasa Lodge, V.1 Office Street, B.C.Road, Gajuwaka, Visakhapatnam-26.
8. Tadi Ramakumar, S/o Ramesh Kumar, D.No-43/29/6, Relli Veedhi, A.V.N. College Down, Visakhapatnam-530 013.
9. Kokkura Nagendra, S/o Mutyala rao, D.No-2/23/9, Karasa, Kotha Road, Visakhapatnam-13.

Please take notice that the above IP No. 01/2025 posted to for your appearance on **16-04-2025** at about **10.30A.M** before the Honourable Court in person or through your Advocate, failing which the matter will be decided exparte.

PANATULA. SATYANARAYANA
Advocate, Visakhapatnam

అవగాహనతోనే ఆటిజం దూరం

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): **ఆటిజం.. ఈ సమస్య బారినపడిన చిన్నారుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఇదీ సమస్య అని ఇతిమిద్ధంగా చెప్పలేని పరిస్థితి. ఒక్కో చిన్నారిలో ఒక్కోరకమైన ఇబ్బందులు కనిపిస్తాయి. సమస్య పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో గుర్తించడం ఆలస్యమవుతోంది. ఆటిజాన్ని స్పెక్ట్రమ్ డిజార్డర్ అని. న్యూరల్ బిహేవియర్ డిజార్డర్ అని చెబుతారు. ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఏప్రిల్ రెండో తేదీన ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.**

- నాలుగు నుంచి ఆరు శాతం మంది చిన్నారుల్లో ఎదురవుతున్న సమస్య
- న్యూరల్ బిహేవియర్, స్పెక్ట్రమ్ డిజార్డర్‌గా దీనికి పేరు
- సకాలంలో గుర్తించలేకపోతున్న తల్లిదండ్రులు
- పిల్లలను గమనించాలంటున్న నిపుణులు
- **నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం**

ప్రపంచ వ్యాప్తంగా ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా వంటి దేశాల్లో 20 శాతం ఆటిజం కేసులు నమోదవుతుండగా, మన దేశంలో ఐదు శాతానికి పైగానే నమోదవుతున్నట్టు చెబుతున్నారు. దీని బారిన పడుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతుండడంతో 2007 నుంచి ప్రజల్లో ఆటిజంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆటిజం అంటే..?

ఆటిజం అంటే ఒక్క మాటలో చెప్పడం కష్టం. ఈ సమస్య బారినపడిన చిన్నారుల్లో ఒక్కో లక్షణం కనిపిస్తుంది. ప్రవర్తనలో మార్పులతో కూడిన వ్యాధిగా చెప్పవచ్చు. శరీరంలోని కొన్ని భాగాల్లో ఎదుగుదల



తక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ పిల్లలతో పోలిస్తే ఆటిజం బారినపడిన చిన్నారుల వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని, దీనిని బట్టి వ్యాధిని గుర్తించేందుకు వీలుంటుందని చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

ఆటిజం బారినపడిన చిన్నారులను కొన్ని లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంది. ఎవరితోనూ కలవకపోవడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలకకపోవడం, ఒంటరిగా ఆడుకోవడం, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుండడం, హైపర్ యాక్టివ్‌గా ఉండడం, ఎక్కువ ఆందోళనకు గురవుతుండడం, వింత శబ్దాలు చేయడం, అకస్మాత్తుగా కోపం రావడం వంటి లక్షణాలుంటాయి.

వినిపించడం లేదనే...

ఆటిజం బాధిత చిన్నారులకు కేజీహెచ్‌లోని డిస్ట్రిక్ ఎర్లీ ఇంట్రివెన్షన్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తారు. కొన్ని ప్రైవేటు సంస్థలు, ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతున్నాయి. సుమారు 90 శాతం మంది తల్లిదండ్రులు మూడేళ్లలోపే చిన్నారుల్లో ఈ సమస్యను గుర్తించి తీసుకువస్తుంటారు. వీరంతా చిన్నారులకు వినపడడం లేదనే చెబుతుంటారని కానీ, వినికిడి సమస్య



సాధారణంగానే ఉంటుందని, స్పందించే గుణం సరిగా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తం కావాల్సిందే..

ఆటిజం సమస్యతో బాధపడే చిన్నారులను రెండేళ్లలోపే గుర్తించడం సాధ్యమని కేజీహెచ్‌లోని డీఐసీ పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ సంధ్యారాణి చెబుతున్నారు. అమ్మ, కావాలి, ఇవ్వు వంటి చిన్నచిన్న పదాలు కూడా మాట్లాడలేకపోతే వెంటనే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. రెండేళ్లలోపు చిన్నారులు ఈ పదాలు మాట్లాడతారని, ఇవి రాకపోయినా, పైన పేర్కొన్న లక్షణాలున్నా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

ఇవీ కారణాలు..

ఆటిజం సమస్య జన్యుపరమైన కారణాల వల్ల వస్తుంది. అతి తక్కువ కేసుల్లో గర్భధారణ సమయంలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడినా, గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన ఉద్వేగాలకు లోనైనా పుట్టే పిల్లలకు ఆటిజం వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, అందులో స్రవించే సెరటోనిన్, డోపమైన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోయినా, నెలలు నిండకుండా జన్మించినా, బాల్యంలో పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపకపోయినా, స్క్రీన్ టైమ్, ఇంట్లో పిల్లలు ఒంటరిగా ఉన్నా దీని బారినపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఇదీ చికిత్స..

ఆటిజం బారినపడిన చిన్నారులకు లక్షణాలను బట్టి మైల్డ్, మోడరేట్, సివియర్‌గా విభజించి వైద్య సేవలు అందిస్తారు. స్క్రీనింగ్ చేసి విభజిస్తారు. సమస్య తీవ్రతను బట్టి స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సార్ స్టిములేషన్ వంటి పద్ధతులను అనుసరించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తారు.

సత్వరం గుర్తించడం కీలకం



ఆటిజం సమస్యను సత్వరం గుర్తించడం కీలకం. ఆలస్యమైతే వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. కేజీహెచ్‌కు ప్రతినెలా పది కేసులు వస్తుంటాయి. సమస్య తీవ్రతను బట్టి వైద్యం అందిస్తాం. గర్భిణిగా ఉన్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంతవరకు సమస్యకు దూరం కావచ్చు. జన్యుపరమైన కారణాలతో వచ్చే సమస్యను ఏమీ చేయలేం. ఆటిజంతో బాధపడే చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. సమస్యను గుర్తించిన తరువాత కొన్ని వారాల పాటు కౌన్సెలింగ్, థెరపీ చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం చిన్నారులు ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

- డాక్టర్ హరిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాబస్‌స్టేషన్ ఆవరణలోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నాయి. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్సులోని స్కిల్‌డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిప్లమో, ఐటీఐ చదివి 18 నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన యువత అర్హులన్నారు. అభ్యర్థులకు యూనిఫారం, పుస్తకాలు, ఏసీ క్యాంపస్ సదుపాయాలు కల్పిస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంస్థకార్యాలయంలో కానీ, 93816 67986, 72079 53919 నంబర్లలో కానీ సంప్రతించాలన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

ఆరిలోవ, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి) పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు జిల్లాలో 28,660 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 28,566 మంది హాజరయ్యారని, 94 మంది గైర్హాజరయ్యారన్నారు. ఏడు కేంద్రాలను డీఈవో, 35 కేంద్రాలను స్క్వాడ్ సందర్శించాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

19న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ఇచ్చిన సందర్భంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

గౌరవప్రదమైన జీవనం గడిపేందుకే పింఛన్

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- జిల్లా ప్రత్యేకాధికారి కాటమనేని భాస్కర్‌తో కలిసి పింఛన్ల పంపిణీ

మహారాణిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదమైన జీవనం గడిపేందుకు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్‌తో కలిసి మంగళవారం జీవీఎంసీ జోన్ 4 పరిధిలని జైసంతోషిమాత కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్లు అందిస్తోందన్నారు. దివ్యాంగురాలు పి.శరణ్య, వృద్ధులు రాజు, అప్పారావు, వితంతువులు గంగమ్మ, నారాయణమ్మలకు పింఛను మొత్తం అందించారు. అర్హులైనప్పటికీ పింఛన్లు అందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ పీడీ సత్యవేణి, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మావతి. శానిటరీ అధికారి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డు సంతోషిమాత కాలనీలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ప్రత్యేకాధికారి భాస్కర్, తదితరులు

మా పార్టీ కార్పొరేటర్లను బెదిరిస్తున్నారు

- కూటమి నేతలపై కలెక్టర్‌కు వైసీపీ ఫిర్యాదు



కలెక్టర్‌ను కలిసి వస్తున్న వైసీపీ నాయకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్పొరేటర్లను కూటమిపార్టీలో చేరాలంటూ ఆ పార్టీల నేతలు ప్రలోభాలు గురిచేయడంతోపాటు వారి కుటుంబసభ్యులను బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు వైసీపీ నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ జీవీఎంసీ కౌన్సిల్‌లో కూటమికి మెజారిటీ లేనప్పటికీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ నోటీసు ఇచ్చారన్నారు. ఈనెల 19 జరిగే కౌన్సిల్ సమావేశంలో తీర్మానం వీగిపోతుందనే భయంతో కూటమి నేతలు వైసీపీ కార్పొరేటర్లను తమవైపు తిప్పుకోవాలని ఆరాటపడుతున్నారన్నారు. పోలీసులు కూడా టీడీపీ కార్యకర్తల మాదిగా పనిచేస్తున్నారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే అలాంటి వారు ఇబ్బంది పడాల్సి ఉంటుందని హెచ్చరించారు. చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కేకే రాజు, కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకటరామయ్య, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పలు బొక్కేస్తున్నారు!

- భీమిలి నూకాలమ్మ ఉత్సవాల్లో దేవదాయ శాఖ సిబ్బంది అక్రమం
- గత 22 ఏళ్లుగా వేలం వేయకుండా సొమ్ములు స్వాహా
- ప్రసాదంగా పంచేశామని బుకాయింపు



నూకాలమ్మ ఆలయం

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి నూకాలమ్మ ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి మొక్కుబడిగా కొట్టే కొబ్బరి చెక్కల్లో దేవదాయ శాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చి 27 నుంచి 30 వరకూ జరిగిన ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారి హుండీలు, దర్శనం టికెట్ల ద్వారా రూ.12.9 లక్షల ఆదాయం వచ్చింది. కానీ కొబ్బరి చెక్కలను వేలం వేయలేదు. ఆలయాన్ని దేవ దాయ శాఖ తీసుకున్న 2002 నుంచి ఒక్కసారి కూడా కొబ్బరి చెక్కలకు వేలం వేయకుండా ఆదాయం స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి.

అసలు కథ ఇదీ!

గ్రామ ఆచారం ప్రకారం ఎగువపేట, బోయవీధి ప్రజలకు కొబ్బరి చెక్కలను అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ 23 ఏళ్లుగా కొన్ని వందల టన్నుల కొబ్బరి చెక్కలను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఎగువపేటకు చెందిన మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు, బోయవీధికి చెందిన టీడీపీ నాయకుడు కొక్కిరి అప్పన్న మాట్లాడుతూ పూర్వం పెద్దలకు పంపించేవారని, దేవదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత ఆ పరిస్థితే లేదన్నారు. ఉత్సవాల సమయంలో హుండీల ఆదాయం తీసుకోవడమే గానీ ఆలయ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఎగువపేట వైసీపీ నాయకుడు అల్లిపిల్లి నరసింగరావు, బోయవీధి కాంగ్రెస్ నేత జగన్నాథరావు ఇదే విషయం వెల్లడించారు.

ప్రసాదంగా పంచేస్తున్నాం : ఈఓ

ఈ విషయమై నూకాలమ్మ ఆలయ ఈవో బొంగరాల మురళీమోహన్ వద్ద ప్రస్తావించగా, ఆచారం ప్రకారం పూజారి సమక్షంలోనే బోయవీధి, ఎగువపేట ప్రజలకు కొబ్బరిచెక్కలు ప్రసాదంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈసారి రశీదు ఇచ్చామని, వచ్చే ఏడాది నుంచి వేలం వేస్తామన్నారు. పూజారి చౌదరి సత్యరాజ్ కొబ్బరి చెక్కలను గ్రామాలకు పంపగా మిగిలినవి తాము వినియోగించుకుంటున్నామన్నారు.

నకిలీ డీలర్ల అడ్డగోలు వ్యవహారం

- పౌరసరఫరాల శాఖలో మరో దందా
- ప్లాస్టిక్ వేలిముద్రతో ఆన్‌లైన్‌లో లాగిన్
- గోదాము నుంచి సరకు విడిపించినప్పటి నుంచి ఎండీయూకు అప్పగించే వరకు అదే తీరు
- ఐరిస్ విధానం అమలుతోనే కట్టడి

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో నకిలీరేషన్ డీలర్ల అడ్డగోలు వ్యవహారాలపై జిల్లాలో తాజాగా చర్చ సాగుతోంది. నకిలీ డీలర్లు తమ బాగోతం బయటకు రాకుండా ఒరిజినల్ డీలరు వేలిముద్రకు నకిలీ వేలిముద్ర తయారుచేసి ఎండీయూలకు బియ్యం అందజేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ గోదాములో సరకులు విడిపించేటప్పుడు, డిపోల నుంచి ఎండీయూలకు బియ్యం అందజేసినపుడు, సర్వర్ మొరాయించిన ప్రతిసారీ తిరిగి యాక్టివ్ అయ్యే వరకు నకిలీ వేలిముద్రే కీలకంగా పనిచేస్తోంది.

నగరంలో సుమారు 200 మందికిపైగా నకిలీ డీలర్లు ఉన్నారనే వాదన నేపథ్యంలో వారంతా ఒరిజినల్ డీలరు వేలిముద్రను తయారుచేసి, దాంతో మొత్తం కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 643 రేషన్ డిపోలున్నాయి. వీటిలో 200కుపైగా డిపోలు చాలాకాలం క్రితమే చేతులు మారాయి. ఒరిజినల్ డీలరు స్థానంలో నకిలీలు తెరపైకి వచ్చారు. కొందరు ఒరిజినల్ డీలర్ల నుంచి డిపోలు కొనుగోలు చేయగా మరికొందరు లీజుకు తీసుకున్నారు. కొన్నిచోట్ల ఒరిజినల్ డీలర్లు చనిపోవడం, రాజీనామా చేయడంతో పౌరసరఫరాల శాఖతో కుమ్మక్కై. నకిలీలకు సదరు డిపోలు అటాచ్ చేయించి ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఒరిజినల్ డీలరు వేలిముద్రను తయారుచేసి దాంతో బియ్యం విడుదల నుంచి ఎండీయూకు అప్పగించే వరకు ఇదే వేలిముద్రను వాడుతున్నారు. ఈ వ్యవహారం మొత్తం గోదాము ఇన్‌చార్జి నుంచి ఎండీయూ ఆపరేటర్, చెకింగ్ ఇన్‌స్పెక్టరు, పౌరసరఫరాల అధికారుల వరకు అందరికీ తెలుసు. కానీ ప్రతి స్థాయిలో లంచాలు పడేయడంతో ఏ ఒక్కరు నోరు మెదపడంలేదు. దీంతో నకిలీలే గోదాము నుంచి సరకులు తీసుకున్న నుంచి వీధుల్లో కార్డుదారులకు పంపిణీ కోసం ఎండీయూలకు అప్పగించే వరకు నకిలీ వేలిముద్రలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి.



లాగిన్ అయ్యేందుకు వినియోగిస్తున్న నకిలీ వేలి ముద్ర

ఇలా వినియోగిస్తున్నారు

ఒరిజినల్ డీలరు బొటనవేలు ముద్రతో దీనిని తయారుచేస్తారు. కొవ్వొత్తిని వేడిచేసి, కరిగించిన తరువాత వచ్చే ముద్దపై ఒరిజినల్ డీలరు బొటనవేలుతో ముద్ర వేస్తారు. దానిపై ఫెవికాల్ రాసి తరువాత వేలిముద్ర అంత సైజులో దానిని తయారుచేసి రెండురోజులు ఎండలో ఆరబెడతారు. మరో పద్ధతి ప్రకారం అక్వేరియం కోసం వాడే గమ్‌ను వేడిచేసి వేలిముద్ర వేసి దానిపై ఫెవికాల్ వేసి ఎండలో ఆరబెడతారు. తరువాత గోదాము వద్దకు సరకులు విడిపించడానికి, డిపోవద్ద ఎండీయూకు సరకులు ఇచ్చేటప్పుడు ఈపోస్ మిషన్‌పై వేలిముద్రవేసే చోట ముందుగా నకిలీ వేలిముద్ర పెట్టి దానిపై ఎవరైనా వేలిముద్ర వేస్తే ఆన్‌లైన్‌లో పోర్టల్ ఓపెన్ అవుతుంది.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **KANATAM SUDHAKAR** (Old Name), S/o. Konatham Bala, resident of 38-38-66/1, Shiva Nagar, 2nd Lane, Maripalem, Visakhapatnam. Change my name from **KANATAM SUDHAKAR** (Old Name) to **KONATHAM SUDHAKAR** (New Name). Henceforth I am being called as **KONATHAM SUDHAKAR** (New Name) for all purposes.

AJV_231557

CHANGE OF NAME

★ I, **CHINTHALAPALLI KUMAR PRAKASH** (Old Name), S/o. Chintapalli Appalaswami, resident of 5-257, Vivekananda Nagar, Old Dairy Farm, Visakhapatnam. Change my name from **CHINTHALAPALLI KUMAR PRAKASH** (Old Name) to **CHINTAPALLI KUMAR PRAKASH** (New Name). Henceforth I am being called as **CHINTAPALLI KUMAR PRAKASH** (New Name) for all purposes.

AJV_231556

CHANGE OF NAME

★ We, **KALIDINDI TAMMIRAJU & KALIDINDI SRAVANTHI** parents of **KALIDINDI PRAHARSHITHA** (New Name), previously called **KALIDINDI PRAHARSHITA** (Old Name), resident of D.No. F.No. 215, Sai Vihar Apts., Veduravada, Atchutapuram, Anakapalli. Now changed my daughter's name from **KALIDINDI PRAHARSHITA** (Old Name) to **KALIDINDI PRAHARSHITHA** (New Name). Henceforth I am being called as **KALIDINDI PRAHARSHITHA** (New Name) for all purposes.

AJV_231558

CHANGE OF NAME

I, **SABBAVARAPU RAJASHEKHAR** (Old Name), S/o. Appalanaidu, resident of N.Kothuru Village, Rolugunta Mandal, Anakapalli Dist. A.P. Changing my name from **SABBAVARAPU RAJASHEKHAR** (Old name) to **SABBAVARAPU RAJASHEKAR** (New Name). Henceforth I am being called as **SABBAVARAPU RAJASHEKAR** (New Name) S/o. Appalanaidu, for all purposes.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176, 9966165093

మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొన్న ఆటోడ్రైవర్

- వాహనం బోల్తా పడడంతో ఐదుగురు విద్యార్థులకు గాయాలు



గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్

గాజువాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆటోను డ్రైవర్ డివైడర్‌కు ఢీకొనడంతో వాహనం బోల్తా పడడంతో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గాజువాక చైతన్యనగర్‌లో గల వివిధ పాఠశాలల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు మింది నుంచి ఎర్రు నాయుడు అనే వ్యక్తికి చెందిన ఆటోలో మంగళవారం మధ్యాహ్నం ఇళ్లకు బయలుదేరారు. గాజువాక సబ్ స్టేషన్ సర్వీసు రోడ్డు వద్దకు రాగానే ఆటోను డ్రైవర్ వేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సీహెచ్ భార్గవ్ (7), సీహెచ్ భువనదీప్ (11), సీహెచ్ నిమిషా (13), కె.సాహితి (14), అభిరాం (12)కు గాయాలయ్యాయి. మోనికా అనే విద్యార్థినికి గాయాలు కాలేదు. స్థానికులు ఆటోలో ఇరుక్కున్న విద్యార్థులను బయటకు తీసి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని తల్లిదండ్రులు తమ ఇళ్లకు తీసుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, సీఐ కోటేశ్వరరావులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించడంతో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన విద్యార్థులను పరామర్శించారు. ఆటో డ్రైవర్ ఎర్రినాయుడిని అదుపులోకి తీసుకుని డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా 550 పాయింట్ల రీడింగ్ నమోదైనట్టు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పెందుర్తి-రూరల్ , ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోర్లుపాలెం రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం గుర్తు తెలియని మృతదేహం పోలీసులకు లభ్యమైంది. మృతుడు స్థానికేతరుడిలా ఉన్నాడని, బ్లాక్ ఫ్యాంట్ ధరించాడని, వయసు 40 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 9440796039 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సీఐ కేవీ సతీశ్‌కుమార్ కోరారు.

చికిత్స పొందుతూ ఉక్కు ఉద్యోగి మృతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2 విభాగంలో ఈ నెల 14న జరిగిన ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగి బి.పెంటయ్య మంగళవారం రాత్రి మృతి చెందారు. విభాగంలో మంటలు చెలరేగడంతో విధుల్లో ఉన్న పెంటయ్యకు గాయాలయ్యాయి. దీంతో ఉక్కు ఆస్పత్రికి.. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతి చెందారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తిపన్ను చెల్లింపుపై యూజర్ మాన్యువల్

- జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్



వృత్తి పన్ను పోర్టల్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు వసూలు చేసే వృత్తిపన్నును ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వాణిజ్య పన్నుల శాఖ వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రత్యేకంగా యూజర్ మాన్యువల్ తయారు చేశామని విశాఖపట్నం జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. చినగదిలిలోని జీఎస్టీ కార్యాలయంలో మంగళవారం దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తి పన్ను చెల్లించే ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, పన్ను చెల్లించి, దాని రిటర్న్ కూడా సమర్పించాలన్నారు. వృత్తిపన్ను బకాయిలు ఉన్నవారు ఎవరైనా ఆ మొత్తం వాణిజ్య పన్నుల శాఖకే చెల్లించాలన్నారు.

జనశిక్షణ సంస్థాన్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థాన్‌లో స్వల్పకాలిక సమ్మర్ క్రాష్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డైరెక్టర్ సీహెచ్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, డ్రెస్ మేకింగ్, అడ్వాన్స్డ్ టైలరింగ్, డీటీపీ, ఫొటోషాప్, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్ ప్యాకేజీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, అగరబత్తీ, జూట్‌బ్యాగ్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో పది రోజుల నుంచి ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల ఏడో తేదీలోగా పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో సంప్రతించాలన్నారు. మరిన్ని వివరాలకు 85000 54456 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రేపటి నుంచి యూఎఫ్‌యూ టీ20 క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏసీఏ- వీడీసీఏ అంపైర్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్ఆర్.ప్రకాశ్ (చిన్నరాజు), పీవీ.రామరాజు (పోలీసు) స్మారక టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో గురువారం ప్రారంభంకానుందని టోర్నీ నిర్వాహక సభ్యుడు డేవిడ్ సునీల్ తెలిపారు. వీడీసీఏ-బీ గ్రౌండ్, ఉక్కునగరం త్రిష్టా గ్రౌండ్, జింక్ గ్రౌండ్ వేదికలుగా జరిగే ఈ టోర్నీలో 14 జట్లు పాల్గొంటాయని, అన్ని మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. జిల్లా క్రికెట్ సంఘం గుర్తింపు పొందిన క్రికెట్ క్లబ్‌లు పాల్గొంటాయని తెలిపారు.

6న సింహగిరిపై సీతారాముల కల్యాణం



గంగధార వద్ద సీతారామస్వామి దేవాలయం

సింహాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సీతారాముల వార్షిక తిరుకల్యాణ మహోత్సవాన్ని ఈనెల 6న సింహగిరిపై నిర్వహించనున్నట్టు ఈఓ కొమ్ముల సుబ్బారావు ప్రకటించారు. ఏటా చైత్ర శుక్లపక్ష నవమి రోజున అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం నిర్వహించడం ఆచారం. ఈ క్రమంలో ఈనెల 6 న సింహగిరి గంగధార సమీపాన ఉన్న సీతారామస్వామి సన్నిధి, ప్రధాన రాజగోపురానికి ఎదురుగా గల కాశీవిశ్వేశ్వర పంచాయతన దేవాలయ సముదాయంలోని రాములవారి ఆలయంలో ఉదయం 10.30గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఈవో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సీతారాముల కటాక్షాన్ని పొందాలని కోరారు.